
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
గుంటూరు
జిల్లా వార్తలు
5
సోమవారం 2 డిసెంబరు 2024






వర్సిటీలో విద్యార్థినుల వసతిగృహంలో విచారణ అనంతరం బయటకు వస్తున్న తెనాలి సబ్ కలెక్టర్ సంజనసిన్హా

చీఫ్ వార్డెన్‌ను తొలగించాలి

- కలుషిత ఆహారంతో అనారోగ్యాలు
- విచారణ కమిటీ ఎదుట విద్యార్థినుల సమస్యలు ఏకరువు
- ప్రభుత్వానికి నేడు నివేదిక అందించనున్న కమిటీ

పెదకాకాని, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): నాసిరకంగా భోజనం.. ఆహారంలో జర్రి, కప్ప లాంటి పురుగులు.. తాగునీటితో పాటు వాడుకునే నీరు కలుషితం.. ఈ సమస్యలను పలుమార్లు చెప్పినా పరిష్కరించక పోగా మమ్మల్ని బెదిరిస్తున్న చీఫ్ వార్డెన్ వెంకటరత్నమ్మను విధుల నుంచి తొలగించాలి.. మా ఆరోగ్యాలను రక్షించాలి.. అంటూ ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం వసతిగృహ విద్యార్థినులు డిమాండ్ చేశారు. విద్యార్థినుల ఆందోళనకు స్పందించిన రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు కలెక్టర్ నాగలక్ష్మి నియమించిన విచారణ కమిటీ ఆదివారం మహిళా వసతి గృహాన్ని సందర్శించి బహిరంగ విచారణ చేపట్టింది. తెనాలి సబ్ కలెక్టర్ సంజన సిన్హాతో పాటు జిల్లా సివిల్ సప్లై అధికారి పద్మజ, ఫుడ్‌సేఫ్టీ అధికారి రవీందర్‌రెడ్డిలు విద్యార్థినులతో సమావేశమై సమస్యలను స్వయంగా అడిగి తెలుసుకున్నారు. ప్రతిరోజు తమకు నాణ్యతలేని ఆహారాన్ని పెడుతున్నారని, అప్పుడప్పుడు భోజనంలో పురుగులు వస్తున్నాయని, నీరు కలుషితంగా సరఫరా అవుతున్నాయని, వాటర్ ట్యాంకుల్లో తల వెంట్రుకలు ఉన్నాయని, వంట తయారు చేసే పరిసరాలు నాచుతో అపరిశుభ్రంగా ఉన్నాయి అని విద్యార్థినులు కమిటీ ఎదుట వాపోయారు. ఈ సమస్యలను పలుమార్లు చీఫ్ వార్డెన్ వెంకటరత్నమ్మను కలిసి చెప్పినా సమస్యలను పరిష్కరించకుండా తమపై బెదిరింపు ధోరణితో వ్యవహరించారని ఫిర్యాదు చేశారు. ఆమె తీరుతో తమ ఆరోగ్యం ప్రమాదంలో పడినట్లయిందని చెప్పారు. తమ ఆరోగ్యానికి ప్రమాదం తీసుకొచ్చిన చీఫ్ వార్డెన్ వెంకటరత్నమ్మతో పాటు వార్డెన్లను తక్షణమే పదవుల నుంచి తొలగించాలని విద్యార్థినులు కమిటీకి విన్నవించారు. విచారణ ముగిసిన నేపథ్యంలో నివేదికను కలెక్టర్ నాగలక్ష్మి ద్వారా సోమవారం రాష్ట్ర ప్రభుత్వానికి అందజేయనున్నట్లు కమిటీ సభ్యులు విలేకర్లకు తెలిపారు. నివేదిక ఆధారంగా ప్రభుత్వం వసతిగృహ అధికారులపై చర్యలు తీసుకునే అవకాశం ఉంది.



తాగునీటి చెరువు

జల్‌జీవన్‌తో..
ప్రతీ ఇంటికి కుళాయిల ద్వారా సురక్షితమైన తాగునీరు అందించాలి. గ్రామీణుల ఆరోగ్యాన్ని పరిరక్షించాలి. 2024 మార్చి కల్లా పనులు పూర్తి చేయాలని కేంద్ర ప్రభుత్వం లక్ష్యంగా నిర్దేశించింది. కానీ గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల పరిధిలో జల్‌జీవన్ పనుల్లో పురోగతి కనిపించడంలేదు. వైసీపీ ప్రభుత్వం ఐదేళ్లు తాగునీటి పథకాల అభివృద్ధిని విస్మరించింది. దీంతో ప్రతి ఇంటికి స్వచ్ఛమైన తాగునీరు అందని ద్రాక్షలా మారింది. రాష్ట్ర ప్రభుత్వం నిధులను పూర్తి స్థాయిలో విడుదల చేయకపోవడంతోనే జల్‌జీవన్ మిషన్ అమలులో జాప్యం జరిగింది. నిధుల కొరతతో బిల్లుల చెల్లింపులు జరగక పోవడంతో కాంట్రాక్టర్లు పనులు నిలిపేశారు. కేంద్ర ప్రభుత్వం తన వాటా నిధులను విడుదల చేయగా రాష్ట్ర ప్రభుత్వం వాటిని దారిమళ్లించడంతోనే పనులు ముందుకు సాగలేదు. జలజీవన్ అమలులో పల్నాడు, బాపట్ల జిల్లాలు రాష్ట్రంలోనే చిట్టచివర స్థానాల్లో ఉన్నాయంటే అధికారుల పనితీరు తెలుస్తోంది. ఎన్నికలకు ముందు కూటమి నేతలు ప్రతి ఇంటికి కుళాయి ద్వారా స్వచ్ఛజలం అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ పరిస్థితుల్లో ఈ పథకం పనులు అమలు చేసే దిశగా కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టాల్సి ఉంది.

స్వచ్ఛజలం.. అందేనా?



శిథిలావస్థలో ఓవర్ హెడ్ ట్యాంక్

- ముందుకు సాగని జలజీవన్
- గ్రామాల్లో తాగునీటి వెతలు తీవ్రం
- నిధులున్నా పనుల నిర్వహణలో నిర్లక్ష్యం
- ప్రతి ఇంటికి అందని ద్రాక్షలా స్వచ్ఛమైన తాగునీరు
- పథకం అమల్లో రాష్ట్రంలోనే చిట్టచివరన పల్నాడు, బాపట్ల జిల్లాలు

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)
స్వచ్ఛమైన.. సురక్షితమైన.. తాగునీటిని ప్రతి ఒక్కరికీ అందించాలి. ప్రధానంగా ఫ్లోరైడ్ నీటిని తాగడం వల్ల ప్రజలు అనారోగ్యం భారిన పడుతున్నారు. ఈ పరిస్థితుల్లో తాగునీటి పథకాలను పూర్తి స్థాయిలో పునరుద్ధరించి కుళాయిల ద్వారా ప్రతీ ఇంటికి తాగునీరు ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వం జల్‌జీవన్ మిషన్‌ను చేపట్టింది. ఇంటింటికీ స్వచ్ఛజలాన్ని సరఫరా చేసే సంకల్పంతో 2019లో ఈ పథకం అమల్లోకి తెచ్చింది. కేంద్ర ప్రభుత్వ లక్ష్యమైన కుళాయిల ద్వారా తాగునీరు అందివ్వడం గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల పరిధిలో కష్టంగా మారింది. ప్రస్తుతం ఉన్న నీటి పథకాల ద్వారా ప్రతి వ్యక్తిగా 40 లీటర్లు నీరు అందుతుంది. జల్‌జీవన్ పథకం ద్వారా ప్రతి వ్యక్తికి 55 లీటర్లు నీరు ఇవ్వాల్సి ఉంది. తాగునీటి పథకాలను పూర్తిస్థాయిలో పునరుద్ధరించి ప్రతి గ్రామంలో నూరు శాతం కుళాయిల ద్వారా నీటిని సరఫరా చేయడమే ఈ పథకం లక్ష్యం. ఇందుకు రూ.1021.38 కోట్లు వ్యయం అవుతుందని అంచనా వేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేరి సగం నిధులతో జల్‌జీవన్ పనులు చేపట్టారు. కేంద్రం తన వాటాలో సుమారు రూ.275 కోట్లు విడుదల చేసింది. ఈ నిధులను వైసీపీ ప్రభుత్వం దారి మళ్లించిన విషయం తెలిసిందే. 2024 మార్చి కల్లా జల్‌జీవన్ మిషన్ కింద చేపట్టిన పనులు పూర్తి చేసి ఇంటింటికి కుళాయిల ద్వారా తాగునీరు ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వం లక్ష్యంగా నిర్దేశించింది. అయితే రాష్ట్రంలో వైసీపీ పాలకుల తీరుతో లక్ష్యం నీరుగారిపోయింది. జలజీవన్ మిషన్ పథకం పనుల్లో పురోగతి

(మిగతా 6వ పేజీలో..)

కుళాయిలు ఇలా..

జిల్లా	గృహాలు	కుళాయిలున్న ఇళ్లు	లేని ఇళ్లు
పల్నాడు	4,34,399	1,47,166	2,87,233
గుంటూరు	2,33,717	1,57,724	75,993
బాపట్ల	3,64,788	1,48,361	2,16,427

గుంటూరు జిల్లా 15వ స్థానం

గుంటూరు జిల్లాలోని గ్రామాల్లో 2,33,717 గృహాలు ఉన్నాయి. జల్‌జీవన్ మిషన్ కింద పనులు ప్రారంభించే నాటికి 1,24,676 గృహాలకు రక్షిత నీటి కుళాయిలు ఉన్నాయి. పథకం అమలులోకి వచ్చిన అనంతరం 33,048 గృహాలకు కొత్తగా నీటి కుళాయిలు ఇచ్చారు. ఇప్పటి వరకు జిల్లాల్లో 1,57,724 గృహాలకు మాత్రమే కుళాయి కనెక్షన్‌లు ఉన్నాయి. కుళాయిల శాతం 53.34 శాతం నుంచి 67.49 శాతంకు పెరిగింది. ఇంకా 75,993 గృహాలకు కుళాయి కనెక్షన్లు ఇవ్వాల్సి ఉంది. కుళాయి కనెక్షన్లలో రాష్ట్రంలో గుంటూరు జిల్లా 15వ స్థానంలో నిలిచింది. జలజీవన్ మిషన్ పథకం కింద 308 పనులు చేపట్టగా 172 పనులు పూర్తయ్యాయి.

కుళాయిలు.. 43.88 శాతం

పల్నాడు, గుంటూరు, బాపట్ల జిల్లాలో 10,32,904 గృహాలు ఉన్నాయి. ఇప్పటి వరకు 4,53,251 గృహాలకు మాత్రమే కుళాయిల ద్వారా నీటి సరఫరా జరుగుతున్నది. అంటే స్వచ్ఛజలం కుళాయిల ద్వారా 43.88 శాతం గృహాలకే అందుతోంది. ఇంకా 5,79,653 గృహాలకు కుళాయి కనెక్షన్ ఇవ్వాలి. గ్రామాల్లో రక్షిత నీటి పథకాలు సక్రమంగా పనిచేయడంలేదు. కుళాయిలు కూడా నామమాత్రంగానే ఉన్నాయి. ఉన్న పథకాలను విస్తరించడంతో పాటు, పైపు లైన్లు, తాగునీటి చెరువుల అభివృద్ధి తదితర పనులు చేపట్టాల్సి ఉంది. మూడు జిల్లాల పరిధిలో జల్‌జీవన్ పథకం పనులు నత్తనడక కన్నా నిదానంగా సాగుతున్నాయి. వందల సంఖ్యలో పనులకు టెండర్లు కూడా నిర్వహించక పోవడం గమనార్హం.





గ్రామోత్సవం నిర్వహిస్తున్న వీరాచారవంతులు

కన్నవదాను భైరవ ఖడ్గాన్ని చేబూనిన ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు, ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి

గుంటూరు లోక్‌సభ పరిధిలో
పచ్చదనాన్ని నింపుతాం

6

- బుర్రిపాలెంలో పచ్చదనం - ప్రాణహితం ప్రారంభించిన కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్

మిర్చి వ్యాపారి అక్రమాలపై పోలీసులకు ఫిర్యాదు

రేషన్ దరఖాస్తులు
స్వీకరించాలా.. వద్దా?

- గ్రామ, వార్డు సచివాలయాల్లో సందిగ్ధ పరిస్థితి
- ఆదివారం రాత్రికి కూడా జారీ కాని మార్గదర్శకాలు
- ఈ ఏడాది జనవరి నుంచి అర్హుల ఎదురుచూపు



గుంటూరు, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): రేషన్‌కార్డుల దరఖాస్తుల స్వీకారంపై సందిగ్ధత నెలకొన్నది. గత కొన్ని రోజులుగా డిసెంబరు 2వ తేదీ(సోమవారం) నుంచి 28వ తేదీవరకు అన్ని గ్రామ/వార్డు సచివాలయాల్లో కొత్త రేషన్‌కారులు, ఉన్న కార్డుల్లో మార్పులు, చేర్పులకి కూటమి ప్రభుత్వం అవకాశం కల్పించబోతున్నదని, కొత్త డిజైన్లతో రేషన్‌కార్డులు పంపిణీ చేయనున్నట్లు విస్తృతంగా ప్రచారం జరిగింది. సంక్రాంతి పండుగకి కొత్తకార్డులను ప్రభుత్వం పంపిణీ చేస్తుందని పేర్కొన్నారు. ఇందుకు సంబంధించి ఆదివారం రాత్రి వరకు మార్గదర్శకాలు ప్రభుత్వం నుంచి జారీ కాలేదు. దీంతో సోమవారం నుంచి దరఖాస్తులు స్వీకరించాలో, లేదో తెలియని పరిస్థితి అధికారుల్లో నెలకొన్నది. ఇంచుమించు 10 నెలలుగా కొత్త రేషన్‌కార్డుల దరఖాస్తులను గ్రామ/వార్డు సచివాలయాల్లో స్వీకరించడం లేదు. ఇందుకు సంబంధించి ఈ-పోస్ సైట్‌ని బ్లాక్ చేశారు. జనవరి, ఫిబ్రవరిలో వచ్చిన దరఖాస్తులు వందల్లో పెండింగ్‌లో ఉన్నట్లు జిల్లా పౌరసరఫరాల అధికారులు తెలిపారు. ఆ తర్వాత ఎన్నికల కోడ్‌తో రేషన్‌కార్డులకు సంబంధించి ఎలాంటి దరఖాస్తులను స్వీకరించలేదు. ఎన్నికల అనంతరం కూటమి ప్రభుత్వం ఏర్పడగా వైసీపీ రంగులతో ఉన్న రైస్‌కార్డులను తొలగించాలని నిర్ణయించింది. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో జారీ చేసిన రేషన్‌కార్డుల్లో మొత్తం కుటుంబ సభ్యుల ఫొటో ఉండేది. అలానే కుటుంబ పెద్ద, వృత్తి, పుట్టిన తేదీ, వయస్సు, వార్షికాదాయం వంటి వివరాలు ఉండేవి. గత వైసీపీ ప్రభుత్వం వాటిని తొలగించి రైస్‌కార్డులంటూ సచివాలయాల ద్వారా పంపిణీ చేసింది. ఆ కార్డుల్లో కుటుంబ సభ్యుల ఫొటోని తీసేసి కేవలం ఆ కుటుంబంలో మహిళ ఫొటోని మాత్రమే ఉంచింది. ఆ కార్డులను గుర్తింపు కార్డులుగా పరిగణించలేని పరిస్థితి. కాగా కొత్తకార్డులు, స్ప్లిట్‌కార్డులు, ఇతర సవరణల కోసం పెట్టుకున్న దరఖాస్తులను నిలిపేసింది. ఆరంచెల మూల్యాంకనం ద్వారా వేలల్లో కార్డులను తొలగించింది. ఈ కారణంగా వారు వంట గ్యాస్ సబ్సిడీకి కూడా దూరమయ్యారు. ఇతర సంక్షేమ పథకాలను కూడా పొందలేకపోయారు. గుంటూరు జిల్లాలో ఇప్పటికే 5 లక్షల 99 వేల 511 కుటుంబాలకు రేషన్‌కార్డులున్నాయి. బాపట్ల జిల్లాలో 4 లక్షల 80 వేల 29, పల్నాడు జిల్లాలో 6 లక్షల 45 వేల 110 కుటుంబాలకు రేషన్‌కార్డులున్నాయి. అయితే ఇంకా అర్హులు మిగిలిపోయి ఉండటంతో వారికి కార్డులు పంపిణీ చేయాలని కూటమి ప్రభుత్వం భావిస్తున్నది. తగిన మార్గదర్శకాలు రాకపోవడంతో సోమవారం నుంచి సచివాలయాలకు దరఖాస్తులతో వచ్చే వారికి ఏమి సమాధానం చెప్పాలో తెలియని పరిస్థితి నెలకొన్నదని అధికారవర్గాలు తెలిపాయి.



నగరంలో ట్రాఫిక్ సమస్యలను పరిశీలించి అధికారులకు ఆదేశాలిస్తున్న ఎస్పీ సతీష్‌కుమార్

ట్రాఫిక్ సిగ్నల్స్ అన్నీ పనిచేయాలి


- వాహనాల రద్దీ సమస్య తలెత్తకుండా చర్యలు
- మూడు వంతెనల పనులు వేగంగా పూర్తి చేయాలి
- నగరంలో పలు ప్రాంతాల్లో పర్యటించిన ఎస్పీ

గుంటూరు, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): నూతన సంవత్సర సమయానికి అంటే ఈ నెలాఖరుకి నగరంలోని అన్ని ట్రాఫిక్ సిగ్నల్స్ పని చేసేలా చర్యలు తీసుకోవాలని ట్రాఫిక్ సిగ్నల్స్ సాంకేతిక బృందాన్ని ఎస్పీ సతీష్‌కుమార్ ఆదేశించారు. ఆదివారం ఆయన నగరంలో పలు ప్రాంతాల్లో పర్యటించి ట్రాఫిక్ సమస్యలను స్వయంగా పరిశీలించి అధికారులకు పలు ఆదేశాలు జారీ చేశారు. మూడు వంతెనల రైల్వే అండర్ పాస్ మరమ్మతులతో ట్రాఫిక్‌ను సంజీవయ్యనగర్, నెహ్రూనగర్ రైల్వే గేట్ల వైపునకు మళ్లించిన విషయం విదితమే. ఈ నేపథ్యంలో మూడు వంతెనల వద్ద జరుగుతున్న పనులను ఎస్పీ పరిశీలించి వాటిని వీలైనంత త్వరగా పూర్తి చేసి ట్రాఫిక్ ఇబ్బందులను తొలగించాలని రైల్వే కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. ట్రాఫిక్ డైవర్షన్స్ వల్ల ప్రజలు ఇబ్బందులపైన, సంజీవయ్య నగర్ - నెహ్రూనగర్ రైల్వే గేట్ల వద్ద ట్రాఫిక్ సమస్యలపైన ఆరా తీశారు. వాహనాలు సాఫీగా వెళ్లడానికి తీసుకోవాల్సిన చర్యల గురించి ట్రాఫిక్ అధికారులకు పలు సూచనలు చేశారు. లాలాపేట పోలీస్‌స్టేషన్ పరిధిలో నిత్యం రద్దీగా ఉండే పూలకొట్ల బజారులో ఎస్పీ పర్యటించారు. ప్రజలకు ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా, రోడ్లపై వాహనాలను నిలపకుండా తీసుకుంటున్న చర్యలు గురించి ఆరా తీశారు. వాహనాల పార్కింగ్ సంబంధించి పోలీసులకు పలు సూచనలు చేశారు. ఎంటీబీ సెంటర్(రమేష్ హాస్పిటల్) వద్ద ఏర్పాటు చేసిన సిగ్నల్స్ పనితీరును, అక్కడ అమర్చిన సమయాల నిడివిని పరిశీలించారు. ఈ పర్యటనలో డీఎస్పీలు సీతా రామయ్య, రమేష్, అజీజ్, జయరాంప్రసాద్, సీఐలు అశోక్‌కుమార్, సింగయ్య, వీరయ్య చౌదరి, వీరస్వామి తదితరులు ఎస్పీ వెంట ఉన్నారు.

ఎమ్మెల్సీ ఓటు ఉందా.. లేదా?

- సీఈవో ఆంధ్ర వెబ్‌సైట్‌లో తెలుసుకునే సౌలభ్యం
- ఒకవేళ లేకుంటే మళ్లీ క్లెయిమ్ చేసుకునే అవకాశం

గుంటూరు, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): కృష్ణా - గుంటూరు పట్టభద్రుల శాసనమండలి నియోజకవర్గానికి సంబంధించి త్వరలో జరగనున్న ఎన్నిక కోసం ముసాయిదా ఓటర్ల జాబితాలు అంతర్జాలంలో అందుబాటులోకి వచ్చాయి. ఆరు జిల్లాల నుంచి అర్హులైన పట్టభద్రులు ఓటు నమోదు కోసం దరఖాస్తు చేసుకోగా వాటిని క్షేత్ర పరిశీలన జరిపిన ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారులు అన్నీ సవ్యంగా ఉన్న వాటిని ఆమోదించారు. సర్టిఫికెట్లు సరిగా పొందుపరచని వారి దరఖాస్తులను తిరస్కరించారు. అర్హులకు ఓటుహక్కు కల్పించిన జాబితాలను జిల్లాల వారీగా సీఈవోఆంధ్ర.ఎన్ఐసీ.ఇన్ వెబ్‌సైట్‌లో నిక్షిప్తం చేశారు. ఈ నేపథ్యంలో ఇప్పటికే దరఖాస్తు చేసుకున్న పట్టభద్రుడికి ఓటు మంజూరైందో, లేదో తెలుసుకునే సదుపాయం ఈ వెబ్‌సైట్‌లో కల్పించారు. అర్హత ఉండి ఎవరికైనా ఓటు రాకపోయినా, ఇంకా ఎవరైనా దరఖాస్తు చేసుకోకపోయినా ప్రస్తుతం జరుగుతున్న క్లెయిమ్‌లు/అభ్యంతరాల స్వీకారం సందర్భంగా అందజేయొచ్చని ఈఆర్‌వో ఎస్ఎస్‌కే ఖాజావలి తెలిపారు.



ఇలా తెలుసుకోచ్చు...

తొలుత సీఈవోఆంధ్ర.ఎన్ఐసీ.ఇన్ వెబ్‌సైట్‌ని వెబ్‌బ్రౌజర్ నుంచి తెరవాలి. అందులో ఎంఎల్‌సీ ఈ రిజిస్ట్రేషన్ -2024లోకి వెళ్లి ట్రాక్ యువర్ అప్లికేషన్ స్టేటస్‌ని మౌస్‌తో క్లిక్ చేయాలి. ఆ వెంటనే మరో విండో ఓపెన్ అవుతుంది. అందులో గ్రాడ్యుయేట్ అనే ఆప్షన్‌ని సెలెక్ట్ చేయాలి. అప్లికేషన్ ఐడీ/ దరఖాస్తుదారుడి పేరు/ ఇంటి నంబరులో ఏదో ఒకటి ఎంపిక చేసుకుని ఆ వివరాలను ఎంటర్ సెర్చ్ వాల్యూలో పొందుపరిచి సెర్చ్‌ని క్లిక్ చేయాలి. ఆ వెంటనే మరో విండో తెరుచుకుని అందులో ఏపీపీ ఐడీ, సబ్మిషన్ డేట్, పీఎస్ నంబరు, ఎస్ఎల్ నంబరు, పేరు, రిలేషన్ నేమ్, హౌస్ నంబరు, ఏఈఆర్‌వో, ఈఆర్‌వో కామెంట్స్, ఏపీపీ స్టేటస్ వివరాలు ప్రత్యక్షమౌతాయి. అందులో ఏపీపీ స్టేటస్‌లో యాక్సెప్టెడ్ అని ఉంటే మీ ఓటు నమోదైనట్లే. అప్పుడు పీఎస్ నంబరు, సీరియల్ నంబరుని ఒక పేపర్ మీద రాసుకోవాలి. ఆ తర్వాత విండోని మూసేసి హోం పేజీకి వెళ్లి ఎలక్టోరల్ రోల్స్‌లో మెనూ ఏపీ ఎమ్మెల్సీ టీచర్స్ గ్రాడ్యుయేట్ రోల్స్-2024పై మౌస్‌తో క్లిక్ చేయాలి. ఆ వెంటనే మరో విండో తెరుచుకుని ఈస్టు-వెస్టు గోదావరి అండ్ కృష్ణా - గుంటూరు గ్రాడ్యుయేట్స్ నియోజకవర్గాల డ్రాఫ్టు రోల్స్-2024ని ఎంపిక చేసుకుని క్లిక్ చేయాలి. దాంతో మరో విండో తెరుచుకుంటుంది. అందులో సెలెక్ట్ కాన్‌స్టిట్యూయెన్సీ డ్రాప్‌డౌన్ మెనూలో 3 నంబరులో ఉన్న కృష్ణా - గుంటూరుని ఎంపిక చేసుకోవాలి. ఆ తర్వాత పక్కనే జిల్లాని ఎంపిక చేసుకోవాలి. అనంతరం గెట్ పోలింగ్ స్టేషన్స్ అనే దానిపై క్లిక్ చేస్తే పోలింగ్ స్టేషన్ నంబరు, పేరు, లొకేషన్ జాబితా తెరుచుకుంటుంది. ఆ తర్వాత ఇంతకుముందు కాగితం మీద రాసుకున్న పోలింగ్‌స్టేషన్‌ని శోధించి వ్యూ మీద క్లిక్ చేస్తే మరో విండో తెరుచుకుని వెరిఫికేషన్ కోడ్‌ని అక్కడ ఉన్నది యథాతథంగా ఎంటర్ చేయమని చెబుతుంది. ఆ కోడ్‌ని ఎంటర్ చేసి సబ్‌మిట్ కొట్టగానే ఓటర్ జాబితా డౌన్‌లోడ్ అవుతుంది. అందులో సీరియల్ నంబరు చూసుకుంటే ఓటు ఉన్నది, లేనిది తెలిసిపోతుంది.

ఓటు లేకపోతే...

"ఒకవేళ ముసాయిదా ఓటర్ జాబితాలో పేరు లేకపోతే మళ్లీ ఓటుహక్కు కోసం క్లెయిమ్ దాఖలు చేసుకోవచ్చు. ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో ఈ సదుపాయం అందుబాటులో ఉన్నది. డిసెంబరు 9వ తేదీ వరకు క్లెయిమ్‌లు దాఖలు చేసుకునేందుకు గడువు తేదీ ఉన్నది. ఆ తర్వాత క్లెయిమ్‌లను పరిష్కరించి డిసెంబరు 30న తుది ఓటర్ల జాబితాని ప్రచురిస్తారు. కాగా ఇప్పటివరకు దరఖాస్తు చేసుకోని అర్హులైన పట్టభద్రులు కూడా ఈ అవకాశాన్ని వినియోగించుకుని ఓటరుగా నమోదు అయ్యే అవకాశం ఉన్నది.

రిషితేశ్వరి కుటుంబానికి న్యాయం చేయాలి



ర్యాలీ చేస్తున్న ఐద్వా, ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు

గుంటూరు(విద్య), డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): ర్యాగింగ్, వేధింపులతో మరణించిన ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం అర్కిటెక్చర్ విద్యార్థిని రిషితేశ్వరి కుటుంబానికి న్యాయం చేసేలా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని, హైకోర్టులోప్రభుత్వమే అప్పీల్ దాఖలు చేయాలని ఎస్ఎఫ్ఐ, ఐద్వా నాయకులు డిమాండ్ చేశారు. రిషితేశ్వరికి న్యాయం చేయాలని కోరుతూ నగరంలో ఆదివారం బ్రాడీపేట ఎస్ఎఫ్ఐ కార్యాలయం నుంచి శంకర్‌విలాస్ సెంటర్ వరకు నిరసన ర్యాలీ నిర్వహించారు. ఎస్ఎఫ్ఐ పూర్వ జిల్లా కార్యదర్శి లక్ష్మణరావు, ఐద్వా జిల్లా కార్యదర్శి ఎల్.అరుణ మాట్లాడుతూ రిషితేశ్వరి ర్యాగింగ్ తట్టుకోలేక హాస్టల్ గదిలో ఆత్మహత్యకు పాల్పడిందని, సూసైడ్ నోట్ ఆత్మహత్యకు గల కారణాలు స్పష్టంగా పేర్కొన్నా న్యాయం జరగక పోవడం దారుణమన్నారు. సీనియర్ విద్యార్థుల వేధింపులు, వర్సిటీ యాజమాన్యం నిర్లక్ష్యం కారణంగానే రిషితేశ్వరి ఆత్మహత్యకు పాల్పడిందన్నారు. తొమ్మిది సంవత్సరాలపాటు న్యాయస్థానంలో విచారణ జరిగినా బాధితులకు న్యాయం జరగలేదన్నారు. కార్యక్రమంలో ఐద్వా నాయకులు అనూరాధ, స్వాతి, బాష, రమణ, పద్మ, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎం.కిరణ్, ఎస్కే సమీర్, నగర అధ్యక్షుడు యశ్వంత్, సురేంద్ర, సుభాని, షంషీర్, శివాజీ, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా వీరారాధన ఉత్సవాలు

- పల్నాటి యుద్ధంపై కథాగానం
- ఘనంగా గ్రామోత్సవం
- ఆయుధాలను తిలకించిన ప్రజాప్రతినిధులు



ప్రథమ స్థానం సాధించిన బాపట్ల జిల్లా ఎడ్లజత

కారంపూడి, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): మాచర్ల రాజులు అలరాజును రాయబారిగా గురజాలకు పంపడం, అది సహించని నాగమ్మ చర్లగుడిపాడు వద్ద అలరాజుపై విషప్రయోగం చేయించి హతమార్చి పల్నాటి యుద్ధంకు శ్రీకారం చుట్టింది. ఈ సంఘటనను కథాగానం చేశారు. వీరారాధన ఉత్సవాలు రెండో రోజైన ఆదివారం కొన సాగాయి. వీరాచారవంతులు ఆనాటి ఆయుధాలకు గంగధార మడుగులో స్నానమాచరింపజేసి వాటిని అలంకరించి నూతన వస్త్రాలు ధరింపజేసి పొంగళ్లు వండి నైవేద్యం సమర్పించారు. అనంతరం గ్రామోత్సవం జరిపారు. వీర్ల దేవాలయం నుంచి ప్రారంభమైన ఊరేగింపు చెన్నకేశవస్వామి ఆలయం, బ్రహ్మనాయుడు విగ్రహం, అంకాళమ్మ ఆలయం చోట్ల కత్తిసేవ చేసి పీఠాధిపతి ఇంటి వద్ద ప్రదర్శన నిర్వహించారు. పీఠాధిపతి తరుణ్ చెన్నకేశవ ఆవేశంతో ఊగిపోతున్న వీరాచారవంతులకు తీర్థమిచ్చి శాంతింపజేశారు. పీఠాధిపతి వీర్లదేవాలయంలోని మండపంలో ఆశీనులు కాగా వీరవిద్యావంతులు రాయబారం ఘట్టాన్ని గానం చేశారు.

ప్రత్యేక పూజల్లో ఎంపీ, ఎమ్మెల్యే

నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, మాచర్ల శాసనసభ్యుడు జూలకంటి బ్రహ్మానందరెడ్డి, పిడుగురాళ్ల పట్టణ ప్రముఖ వైద్యుడు, టీడీపీ నేత ఉన్నం మల్లికార్జునరావు స్థానిక ఆలయాల్లో ప్రత్యేక పూజలు జరిపారు. ముందుగా వీరుల దేవాలయంలో వీరుల ఆయుధాలను ఆసక్తిగా తిలకించారు. కన్నమదాసు భైరవఖడ్గాన్ని చేతబూనారు. అలాగే చెన్నకేశవస్వామి, అంకాళమ్మ ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. ముందుగా కూటమి నేతలు భారీ ర్యాలీతో వారికి ఘనస్వాగతం పలికారు.

బాపట్ల జిల్లా ఎడ్లజత ప్రథమం

కారంపూడి వీరారాధన ఉత్సవాలను పురస్కరించుకుని స్థానికంగా నిర్వహిస్తున్న తెలుగు రాష్ట్రాల స్థాయి ఎడ్ల బండలాగుడు పోటీల్లో ఆదివారం సేద్యపు విభాగం పోటీలు జరిపారు. ఈ పోటీల్లో బాపట్ల జిల్లా, సంతమాగులూరుకు చెందిన వజ్రాల తేజశ్రీ ఎడ్లజత నిర్ణీత సమయంలో పందెపు బండను 4200 అడుగుల దూరం లాగి ప్రథమ స్థానంలో నిలిచింది. తెలంగాణ రాష్ట్రం, హైదరాబాద్‌కు చెందిన రోహన్ బాబు ఎడ్లజత 4159.8 అడుగులతో రెండోస్థానం, గుంటూరు జిల్లా, పెదకాకాని మండలం, కొప్పురావూరుకు చెందిన తోట శ్రీనివాసరావు, తెలంగాణ జిల్లా మేళ్ల చెరువుకు చెందిన కొప్పుల గోవర్ధన్‌రెడ్డి, ప్రవలేష్‌రెడ్డి సంయుక్త ఎడ్లజత 4053.6 అడుగులతో మూడోస్థానంలో నిలిచాయి. అనంతరం విజేత ఎడ్లజతల యజమానులకు బహుమతులు అందజేశారు. సోమవారం సబ్ జూనియర్స్ విభాగంలో ఎడ్ల పోటీలు నిర్వహించనున్నట్లు పోటీల నిర్వాహకులు నాగారపు రామకృష్ణ, బొమ్మిన శ్రీను, పలిశెట్టి హనుమంతురావు, బొమ్మిన శేషగిరిరావు, చింతపల్లి రామ్మూర్తి తెలిపారు.

మిర్చి వ్యాపారి అక్రమాలపై పోలీసులకు ఫిర్యాదు



నల్లపాడు పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేస్తున్న జీఏంసీ ఉన్నతశ్రేణి కార్యదర్శి ఆంజనేయులు

గుంటూరు, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డులో ఎగుమతిదారులు, రైతులను మోసగించిన కమీషన్ వ్యాపారిపై నల్లపాడు పోలీసులకు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ(జీఏఎంసీ) అధికారులు ఫిర్యాదు చేశారు. యార్డులో 2023-28 సంవత్సరాలకు గోపు శ్రీనివాసరెడ్డి అనే వ్యక్తి శ్రీవిజయ భాస్కర్ ట్రేడర్స్ పేరుతో కమీషన్ ఏజంట్ లైసెన్స్‌ని పొందారు. అయితే అతను పల్నాడు జిల్లా నాదెండ్ల మండలంలోని ఇర్లపాడు గ్రామానికి చెందిన రంగనాధుల హరిబాబుకు చెందిన 200 మిర్చి బస్తాలు అమ్మి రూ.16,59,605 చెల్లించలేదు. అలానే మరో రైతు రంగనాధుల రామారావుకు చెందిన 300 బస్తాలు రూ.33,76,074 అమ్మి ఆ మొత్తాన్ని కూడా చెల్లించలేదు. మరోవైపు మిర్చి ఎగుమతిదారులకు తాను రైతులతో మిరపకాయలను ఇప్పిస్తానని చెప్పి వేల్ మురుగన్ అండ్ కో, శ్రీలీలా కృష్ణ ట్రేడర్స్, శ్రీగణపతి చిల్లీస్ ట్రేడర్స్ వద్ద రూ. 95 లక్షల లెటర్‌ప్యాడ్‌ల ద్వారా తీసుకొన్నారు. ఈ మేరకు అటు రైతులు, ఇటు ఎగుమతిదారులు జీఏంసీ ఉన్నతశ్రేణి కార్యదర్శి వినుకొండ ఆంజనేయులుకు ఫిర్యాదు చేయడంతో ఇప్పటికే గోపు శ్రీనివాసరెడ్డికి నోటీసు ఇచ్చారు. మరోవైపు నల్లపాడు పోలీసుస్టేషన్‌లో ఆదివారం ఫిర్యాదు చేసినట్లు సెక్రెటరీ తెలిపారు. శ్రీనివాసరెడ్డితో పాటు ఆయన భాగాస్వామి కిషోర్‌రెడ్డిపై కూడా చర్యలు తీసుకొని సొమ్ము రికవరీ చేసి బాధితులకు ఇప్పించాలని ఫిర్యాదులో పేర్కొన్నట్లు చెప్పారు.

పుల్లడిగుంటలో అన్న క్యాంటీన్ ప్రారంభం



అన్న క్యాంటీన్‌లో భోజనం వడ్డిస్తున్న రామ్‌చౌదరి కుటుంబ సభ్యులు

గుంటూరు, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఎన్ఆర్ఐ ఉప్పుటూరి రామ్‌చౌదరి ఆధ్వర్యంలో గుంటూరు జిల్లా వట్టిచెరుకూరు మండలంలోని స్వగ్రామమైన పుల్లడిగుంటలో తన తల్లి ఉప్పుటూరి సీతామహాలక్ష్మి జయంతిని పురస్కరించుకొని ఆదివారం అన్న క్యాంటీన్‌ను ఏర్పాటు చేశారు. రామ్‌చౌదరి తండ్రి ఉప్పుటూరి శ్రీరాములు నేతృత్వంలో తానా ఫౌండేషన్ చైర్మన్ శశికాంత్ వల్లేపల్లి, తానా ప్రెసిడెంట్ నిరంజన్ శృంగవరపు లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామస్థులకు అన్న క్యాంటీన్ ద్వారా భోజనాన్ని దగ్గరుండి వడ్డించారు. ఇప్పటికే రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వం అన్న క్యాంటీన్‌లను ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. ఇదే స్ఫూర్తితో తన తల్లి పేరుతో గ్రామంలో ప్రజలకు భోజనం అందించేందుకు అన్న క్యాంటీన్‌ను ఏర్పాటు చేయడంపై పలువురు గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పయనీర్ సంస్థల చైర్మన్ చుక్కపల్లి రమేష్, అశోక్ కొల్లా, వెంకట్ జిల్లెలమూడి, శ్రీరామన్నారాయణ పాల్గొన్నారు.



అన్న క్యాంటీన్‌లో భోజనానికి క్యూ

స్వచ్ఛజలం.. అందేనా?

(5 పేజీ తరువాయి)

కొరవడింది. పల్నాడు జిల్లా పరిధిలోని గ్రామాల్లో 4,34,399 గృహాలు ఉండగా ఇంకా 2,29,067 గృహాలకు కుళాయి కనెక్షన్లు ఇవ్వాలి. 33.88 శాతంతో రాష్ట్రంలోనే పల్నాడు జిల్లా చిట్టచివరన 26వ స్థానంలో నిలిచింది. ఈ పథకం కింద 1055 పనులు గర్తించి రూ.508.16 కోట్లు వ్యయమవుతుందని అంచనా వేశారు. మూడో వంతు పనులు టెండర్ స్థాయి కూడా దాటలేదు. బాపట్ల జిల్లా జలజీవన్ అమలులో రాష్ట్రంలో 25వ స్థానంలో నిలిచింది. జిల్లా పరిధిలోని గ్రామాల్లో 3,64,788 గృహాలకు 1,48,361 గృహాలకు మాత్రమే కుళాయి కనెక్షన్లు ఇచ్చారు. రూ.205.22 కోట్లు వ్యయం అంచనాతో జలజీవన్ మిషన్ పథకం కింద 723 పనులు చేపట్టగా 223 పనులు పూర్తి చేశారు. గుంటూరు జిల్లాలోని గ్రామాల్లో 2,33,717 గృహాలకు 1,57,724 గృహాలకు మాత్రమే కుళాయి కనెక్షన్‌లు ఉన్నాయి. కుళాయిల శాతం 53.34 శాతంతో జిల్లా 15వ స్థానంలో నిలిచింది. 308 పనులు చేపట్టగా 172 పనులు పూర్తయ్యాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఐదు నెలలు అవుతున్నా పనుల్లో కదలిక కనిపించడంలేదు. కూటమి ప్రభుత్వం పనులను వేగవంతం చేయాలని గ్రామీణులు కోరుతున్నారు.

నూరు శాతం గ్రామాలివే..

- పల్నాడు జిల్లాలో కేవలం 14 గ్రామాల్లోనే నూరు శాతం గృహాలకు కుళాయిల కనెక్షన్ ఉన్నట్లు ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు తెలిపారు. అమరావతి మండల జూపూడి, చిలకలూరిపేట మండలం దండమూడి, గొట్టిపాడు, కుక్కపల్లివారిపాలెం, పొతవరం, తాతపూడి, వేలూరు, యడ్లపాడు మండలం సందెపూడి, సొలస, మాచవరం మండలం చెన్నాయపాలెం, నాదెండ్ల మండలం చిరుమామిళ్ల, సంకురాత్రిపాడు, రెంటచింతల, వినుకొండ మండలం విఠంరాజుపల్లి గ్రామాల్లో నూరు శాతం కుళాయి కనెక్షన్లు ఉన్నాయి.
- బాపట్ల జిల్లాలో పది గ్రామాల్లోనే నూరు శాతం కుళాయిలు ఇచ్చారు. అమృతలూరు మండలం కోడితాడిపర్రు, ఇంకొల్లు మండలం బీమవరం, ఇడుపులపాడు, జే పంగులూరు మండలం చందలూరు, నూజెళ్లపల్లి, రామకుర్రు, కారంచేడు మండలం కుంకలమర్రు, పర్చూరు మండలం అడుసుమల్లి, యద్దనపూడి మండలం వింజనంపాడు గ్రామాల్లో మాత్రమే నూరు శాతం ఇళ్లకు కుళాయి కనెక్షన్‌లు ఇచ్చారు.
- గుంటూరు జిల్లా పరిధిలో చేబ్రోలు మండలం గొడవర్రు, కాకుమాను మండలం బీకేపాలెం, బోడిపాలెం, గరికపాడు, పండ్రపాడు, రేటూరు, అన్నవరం, బొమ్మువానిపాలెం, కుంచవరం, మంగళగిరి మండలం కృష్ణాయపాలెం, పెదకాకాని మండలం అనమర్లపూడి, తక్కెళ్లపాడు, తంగెళ్లమూడి, వెనిగండ్ల, పెదనందిపాడు మండలం కొప్పర్రు, పొన్నూరు మండలం దొప్పలపూడి, జడవల్లి, ప్రత్తిపాడు మండలం గొట్టిపాడు, కొండవీడు, తుళ్లూరు మండలం అబ్బరాజుపాలెం, మల్కాపురం, వెలగపూడి, వట్టిచెరుకూరు మండలం కొవెలమూడి, కర్నూతల, వట్టిచెరుకూరు, యామర్రులోని అన్ని ఇళ్లకు కుళాయిల ద్వారా నీటి సరఫరా జరుగుతుందని అధికారులు తెలిపారు.

గుంటూరు లోక్‌సభ పరిధిలో పచ్చదనాన్ని నింపుతాం

- కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్



మొక్కలకు నీరు పోస్తున్న కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, పక్కన ఆలపాటి

తెనాలి రూరల్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): గుంటూరు లోక్‌సభ వ్యాప్తంగా మొక్కలు నాటి పచ్చదనాన్ని పెంచి ఆహ్లాదకర వాతావరణంలో ప్రజలందరూ ఆరోగ్యకరమైన జీవనం సాగించేలా పచ్చదనం - ప్రాణహితం కార్యక్రమాన్ని చేపట్టినట్లు కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ చెప్పారు. ఆదివారం మండలంలోని బుర్రిపాలెం గ్రామంలో సీసీఎల్ కాంటినెంట్ ఫ్యాక్టరీ ఎండీ రాజేంద్రప్రసాద్ సహకారంతో పచ్చదనం - ప్రాణహితం కార్యక్రమం ద్వారా మొక్కలు నాటే కార్యక్రమానికి కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ ముఖ్యఅతిథిగా పాల్గొని మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్‌తో కలిసి మొక్కలు నాటి నీరు పోశారు. ఈ సందర్భంగా పెమ్మసాని చంద్రశేఖర్ మాట్లాడుతూ పచ్చదనం - ప్రాణహితం కార్యక్రమం తొలి అడుగు బుర్రిపాలెం గ్రామం నుంచి ప్రారంభించామన్నారు. రోడ్లకు ఇరువైపులా అందమైన చెట్లు ఉండేలా మొక్కలు నాటుతున్నామన్నారు. తొలి దశలో భాగంగా 300 మొక్కలను నాటుతున్నామని గుంటూరు పార్లమెంట్ వ్యాప్తంగా చెట్లు నాటే కార్యక్రమంలో భాగంగా కొన్ని వేల మొక్కలు నాటబోతున్నామన్నారు. సీసీఎల్ ప్రాజెక్ట్ తరుపున కాంటినెంటల్ ఫ్యాక్టరీ ఎండీ రాజేంద్రప్రసాద్ ఈ కార్యక్రమానికి సహకరిస్తూ ఏడాదికి రూ.50 లక్షల చొప్పున ఐదేళ్లలో రూ.2.50 కోట్లు అందించేందుకు హామీ ఇచ్చారని తెలిపారు. ఎన్ఆర్‌జీఎస్ పథకం ద్వారా మొక్కల సంరక్షణ బాధ్యతలు చేపట్టడం జరుగుతుందన్నారు. మాజీ మంత్రి, కృష్ణ - గుంటూరు ఎమ్మెల్సీ అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ ప్రతి క్షణం ప్రజల కోసం తపించే నాయకుడు డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ అన్నారు. కార్యక్రమంలో పలుశాఖల అధికారులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

ఉత్సాహభరితంగా వెయిట్ లిఫ్టింగ్ పోటీలు

పెదకాకాని, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో రెండు రోజులుగా జరుగుతున్న సౌత్ వెస్ట్ జోన్ అంతర విశ్వవిద్యాలయాల పురుషుల వెయిట్ లిఫ్టింగ్ పోటీలు రెండో రోజు ఆదివారం ఉత్సాహంగా సాగాయి. రెండో రోజు ఫలితాలను పోటీల నిర్వాహక కార్యదర్శి వ్యాయామ విద్య డైరెక్టర్ ప్రొఫెసర్ పీపీఎస్ పాల్ కుమార్ వెల్లడించారు. 67 కేజీల విభాగంలో మదురై కామరాజు యూనివర్సిటీ క్రీడాకారుడు సౌత్ వెస్ట్ షెన్ బాగారాజ్ 154 కేజీల బరువులెత్తి బంగారు పతకాన్ని, 73 కేజీల విభాగంలో తిరువల్లూరు యూనివర్సిటీ క్రీడాకారుడు లోగేశ్వరన్ 159 కేజీల బరువులెత్తి బంగారు పతకాన్ని, 81 కేజీల విభాగం మంగళూరు యూనివర్సిటీ క్రీడాకారుడు బి.రజత్ రాయ్ 170 కేజీల బరువులెత్తి బంగారు పతకాన్ని గెలుపొందారు.

భారీ వర్షాలతో ఆర్టీసీ చెన్నై సర్వీసు రద్దు

గుంటూరు, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): తుపాన్ నేపథ్యంలో చెన్నైలో భారీ వర్షాల కారణంగా ఆర్టీసీ చెన్నై సర్వీసును రద్దు చేసినట్లు గుంటూరు -1 డిపో మేనేజర్ రామకృష్ణ తెలిపారు. గుంటూరు-1 డిపో నుంచి చెన్నైకు నిత్యం ఉదయం 9.45 గంటలకు గుంటూరు ఎన్‌టీఆర్ బస్టాండ్ నుంచి బస్సు బయల్దేరుతుంది. చెన్నైలో భారీ వర్షాల కారణంగా రాకపోకలకు తీవ్ర అంతరాయాలు నెలకొన్నట్లు ఆర్టీసీ అధికారులకు సమాచారం అందింది. దీంతో ఆదివారం ఉదయం బయల్దేరే చెన్నై సర్వీసును రద్దు చేశారు. చెన్నైలో తాజా సమాచారం మేరకు సోమవారం ఉదయం బయల్దేరే సర్వీసుపై నిర్ణయం తీసుకుంటామని అధికారులు తెలిపారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

- విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.6.20
- నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	111,119,130
చికెన్ విత్ స్కిన్	210.00
చికెన్ స్కిన్ లెస్	220.00

నేటి నుంచి సామవేదం షణ్ముఖ శర్మ ప్రవచనాలు

గుంటూరు(తూర్పు), డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): స్థానిక సంపత్‌నగర్, శృంగేరి శంకర మఠం, శ్రీ శారద పరమేశ్వరి దేవస్థానంలో సోమవారం నుంచి ఈ నెల 22 వరకు సామవేదం షణ్ముఖ శర్మ ప్రవచనాలు జరుగుతాయని ఆలయ గౌరవ ప్రతినిధి పోలిశెట్టి నాగ సుందరం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతిరోజూ సాయంత్రం 6.30గంటలకు ప్రవచనాలు ప్రారంభమవుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రజలు పాల్గొనాలని కోరారు.



ఉత్తమ కమర్షియల్ ఇంటీరియర్ డిజైన్ అవార్డుని అందుకొంటున్న కాళంగి ప్రణవి

కాళంగి ప్రణవికి ఇంటీరియర్ డిజైన్ అవార్డు

గుంటూరు, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): గ్లోబల్ చాంబర్ ఆఫ్ కన్స్యూమర్ రైట్స్, క్రైట్స్ క్రాఫ్ట్ ప్రొడక్షన్స్ ఎల్‌ఎల్‌పీ సంయుక్తంగా అందజేసిన ఇంటర్నేషనల్ ఎమినెన్స్ అవార్డులలో ఈ సంవత్సరానికి ఉత్తమ కమర్షియల్ ఇంటీరియర్ డిజైన్ అవార్డుని నగరానికి చెందిన కాళంగి ప్రణవి కైవసం చేసుకొన్నారు. ఈ అవార్డును పంజాబ్ రాష్ట్రంలోని గురుగావ్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన 21 వ ఎడిషన్ కార్యక్రమంలో ప్రణవికి ఈ అవార్డు ప్రదానం చేశారు. వ్యాపార రంగంలో ఇంటీరియర్ డిజైన్ ఆవశ్యకత, అభివృద్ధిని విద్యార్థులకు నూతన పద్ధతులలో ప్రణవి బోధించారు. బోధన, అభ్యాసం, అభ్యాస వాతావరణాన్ని పునర్నిర్మించడంలో ఆమె చేసిన విశేష కృషికి గుర్తింపుగా ఈ అవార్డును అందించినట్లు న్యాయ నిర్ణేతలు ప్రకటించారు.

కవి సుభానికి సత్కారం


గుంటూరు, డిసెంబరు (ఆంధ్రజ్యోతి) : శతాధిక కవి సమ్మేళనంలో నగరానికి చెందిన కవి ఎస్‌ఎం సుభానికి ఘన సత్కారం లభించింది. విజయవాడలోని బుక్ ఫెస్టివల్ సమావేశ మందిరంలో కళారత్న పొట్లూరి హరికృష్ణ ఆధ్వర్యంలో ఆదివారం శతాధిక కవి సమ్మేళనం జరిగింది. ఉదయం 11 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు ఆర్ట్ ఫౌండేషన్ ఆధ్వ ర్యంలో జరిగిన ఈ కవి సమ్మేళనానికి ముఖ్యఅతిథులుగా గోళ్ళ నారాయణరావు, ఫౌండేషన్ చైర్మన్ విజయలక్ష్మి పాల్గొన్నారు. ఈ సందర్భంగా సుభానిని ఘనంగా సత్కరించారు. ప్రస్తుత ఆధునిక సమాజంలో తెలుగు సాహిత్య రంగం ఎన్నో సవాళ్ళను ఎదుర్కొంటున్న తరుణంలో సుభాని లాంటి ఎందరో కవులు అందిస్తున్న సేవలు అభినందనీయమన్నారు.

అనుమానాస్పద మృతి



గుంటూరు, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : స్థానిక పట్టాభిపురం పోలీస్ స్టేషన్ పరిధి లోని జేకేసీ రోడ్డులో గుర్తు తెలియని వ్యక్తి అను మానాస్పద స్థితిలో మృతి చెందాడు. గత నెల 20న గుర్తు తెలియని సుమారు 40 సంవత్స రాల వయసు వ్యక్తి ప్రాణాపాయ స్థితిలో కొట్టుమిట్టాడుతుండగా గమనించిన స్థానికులు ఆయనను చికిత్స నిమిత్తం జీజీహెచ్‌కు తరలించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ కొద్ది సమయానికి ఆయన మృతి చెందాడు. అప్పటి నుంచి అతని మృతదేహాన్ని జీజీహెచ్ మార్చురీలో భద్రపరిచారు. మృతుడు ఎవ రనేది తెలియ రాలేదు. మృతుని వివరాలు తెలి సిన వారు పట్టాభిపురం ఎస్‌ఐకు 8688831344 నంబర్‌లో తెలియజేయాలని పోలీసులు కోరారు.

హోటల్ కిటికీలో నుంచి జారిపడి మెడికల్ రిప్ మృతి



గుంటూరు, డిసెం బరు 1 (ఆంధ్రజ్యోతి) : స్థానిక అరండల్ పేట పోలీస్ స్టేషన్ పరిధి లోని బ్రాడీపేట మెయిన్ రోడ్డుపై గల గ్రాండ్ నాగార్జున హోటల్ రెండో అంతస్తు కిటికీలో నుంచి పడి మెడికల్ రిప్ అను మానాస్పద స్థితిలో మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. నెహ్రూనగర్ 9వ లైన్‌కి చెందిన గుర్రం సత్యనారాయణకు దినేష్ కుమార్, హేమంత్ కుమార్ అనే ఇద్దరు సంతానం ఉన్నారు. ఇరువురు సోదరులు మెడికల్ రిప్రజెంటేటివ్స్‌గా జీవనం సాగిస్తున్నారు. అయితే వారు పని చేస్తున్న కంపెనీ శనివారం ఇన్నర్ రింగ్ రోడ్డులోని కన్వెన్షన్ సెంటర్‌లో సమావేశం నిర్వహించింది. సమావేశం అనంతరం ఆయా రిప్రజెంటేటివ్స్ బ్రాడీపేట మెయిన్ రోడ్డు పైన గ్రాండ్ నాగార్జున హోటల్‌లో గదులు తీసుకొని బస చేశారు. అందరూ మద్యం సేవించారు. అయితే అర్ధరాత్రి సమయంలో గుర్రం హేమంత్ కుమార్ (27) కిటికీ డోర్‌ను బలంగా నెట డంతో డోరు తెరుచుకుని అం దులో నుంచి జారీ రెండో అంతస్తు పైనుంచి కింద పడిపోయాడు. వెంటనే ఆయ నను జీజీహెచ్‌కు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. కిటికీకి ఇనుప గ్రిల్ లేకపోవడంతో ఈ ప్రమాదం సంభ వించినట్లు పోలీసులు తెలిపారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు అరండల్‌పేట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

దేవాపురానికి వరద ముంపు లేకుండా చేస్తా

● ఎమ్మెల్యే గల్లా మాధవి
● ఫాతిమాపురం, దేవాపురంలో విస్తృత పర్యటన



దేవాపురంలో అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే మాధవి

గుంటూరు, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): దేవాపురానికి వరద ముంపు లేకుండా చేస్తానని గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గల్లా మాధవి హామీ ఇచ్చారు. స్థానిక ఫాతిమాపురం, దేవాపురంలో ఆదివారం విస్తృతంగా పర్య టించి ప్రజా సమస్యలు తెలుసుకున్నారు. దేవాపురంలో ప్రధానంగా ఆక్ర మణల కారణంగా డ్రైనేజీ వ్యవస్థ కుంచించుకొనిపోవడాన్ని ఆమె గుర్తించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గతంలో ఈ ప్రాంతాల్లో తాను పర్యటించినప్పుడు కల్వర్టులు ప్రమాదకరస్థితిలో ఉన్నాయని అన్నారు. డ్రైనేజీ లైన్‌లోనే కేబుల్స్, పైప్ లైన్లు వెళ్ళడం వల్ల నీటి ప్రవాహానికి అడ్డంకిగా మారాయని గుర్తించినట్లు చెప్పారు. ఇంజనీరింగ్ అధికారులతో మాట్లాడి వాటిని తొలగించి క్రమపద్ధతిలో వాటిని ఏర్పాటు చేశామన్నారు. దేవాపురంలో 5 చోట్ల కల్వర్టులు అవసరం అని గుర్తించి, గతంలో కంటే ఎత్తు, వెడల్పు పెంచి పనులు ప్రారంభించామని, త్వరలోనే ఈ పనులు పూర్తవుతాయని అన్నారు. మరో ప్రాంతంలో రిటైనింగ్ వాల్ అవసరమని గుర్తించి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించినట్లు చెప్పారు. ఆక్రమణల వలన వరదనీరు దేవాపురాన్ని ముంచెత్తుతుండడంతో పీకలవాగు డైవర్షన్, ఆక్రమణల తొలగింపుపై దృష్టి సారించాలని ఆదేశించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ ఈరాంటి వర ప్రసాద్, నరేంద్ర, కిరణ్, చిన్న బాజీ, అస్మ, ఉప్పుటూరి పేరయ్య, వినోద్, మన్నయ్య, అన్వర్, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

పేద విద్యార్థులకు చేయూత నివ్వాలి

● పెదకూరపాడు ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్



ఉపకార వేతనాలు అందజేస్తున్న ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్, ఎమ్మెల్యే గల్లా మాధవి

గుంటూరు(తూర్పు), డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): పేద, ప్రతిభ కల్గిన విద్యార్థులకు ప్రతి ఒక్కరూ చేయూత నిచ్చి, అండగా నిలబడాలని పెదకూరపాడు ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ అన్నారు. స్థానిక చంద్రమౌళీనగర్‌లో ఆదివారం భాష్యం పాఠశాల ఆవరణలో కొండవీటి పాపయ్య, చిన్నమ్మ జ్ఞాపకార్థం వారి కుటుంబ సభ్యులు కొండవీటి నరసింహారావు, పాపా రావు, కిషోర్‌బాబు ఆధ్వర్యంలో పేద విద్యార్థులకు ఉపకార వేతనాలు పంపిణీ చేశారు. భాష్యం ప్రవీణ్ మాట్లా డుతూ పేద విద్యార్థులకు కొండవీటి నరసింహారావు చేసిన సేవలు స్ఫూర్తి దాయకమన్నారు. రాష్ట్రంలో విద్యా వ్యవస్థ అభివృద్ధికి చంద్రబాబునాయుడు, లోకేశ్ కృషి చేస్తున్నారన్నారు. గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గల్లా మాధవి మాట్లాడుతూ ఉపకార వేతనాలు పొందినవారు ఉన్నత స్థాయికి ఎదిగి తమ చుట్టూ ఉండే పేద విద్యార్థులకు చేయూత నివ్వాలని ఆకాంక్షించారు. అనంతరం పెదకూరపాడుకు చెందిన 42 మంది విద్యా ర్థులకు రూ. 1 లక్ష 50 వేల విలువ కలిగిన ఉపకారవేతనాలు భాష్యం ప్రవీణ్ చేతుల మీదుగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కొండవీటి పాపయ్య కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.



అవగాహన ర్యాలీలో పాల్గొన్న ఆరోగ్య సిబ్బంది

ఎయిడ్స్‌రహిత సమాజం కోసం కృషి

● డీఎంహెచ్‌వో డాక్టర్ విజయలక్ష్మి పిలుపు
● ఉత్తమ సిబ్బందికి ప్రశంసాపత్రాలు

గుంటూరు మెడికల్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): యువత హెచ్‌ఐవీ/ఎయిడ్స్‌పై అవగాహన కలిగి ఉండి ఎయిడ్స్ రహిత సమాజ స్థాపనకు కృషి చేయాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ కే విజయలక్ష్మి పిలుపు నిచ్చారు. వరల్డ్ ఎయిడ్స్ డే సందర్భంగా ఆదివారం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ప్రభుత్వ మహిళా కళాశాలలో నిర్వహించిన ఎయిడ్స్ అవగాహన సభలో ఆమె ప్రసంగించారు. తొలుత వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన ర్యాలీని డీఎంహెచ్‌వో ప్రారంభించారు. నగరంపాలెం, హిందూ కాలేజీ కూడలి నుంచి మహిళా కళాశాల వరకు ఈ ర్యాలీ కొనసాగింది. అనంతరం జరిగిన సభలో విజయ లక్ష్మి మాట్లాడారు. జిల్లాలో ఏఆర్‌టీ కేంద్రాల్లో హెచ్‌ఐవీ పాజిటివ్‌లకు ప్రభు త్వం ఉచితంగా మందులు అందజేస్తున్నట్లు తెలిపారు. జిల్లా న్యూక్లియస్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ బీ లక్ష్మానాయక్ మాట్లాడుతూ హైరిస్క్ బి హేవియర్ ఉన్న వారు తప్పనిసరిగా హెచ్‌ఐవీ పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. అనంతరం హెచ్‌ఐవీ నివారణ, బీపీ, షుగర్ పరీక్షలకు సం బంధించిన సమాచారాన్ని, వాల్‌పోస్టర్లను, కరపత్రాలను డీఎంహెచ్‌వో ఆవిష్కరించారు. హెచ్‌ఐవీ/ఎయిడ్స్‌పై పని చేస్తూ ఉత్తమ పని తీరు కన బర్చిన ఆరోగ్య సిబ్బందికి ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ ఇస్మాయిల్, ఐసీటీసీ కేంద్రాల జిల్లా సమన్వయ కర్త జ్యోతుల వీరాస్వామి, మహిళా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వీఆర్ జ్యోత్స్న కుమారి, ఎన్ఎస్ఎస్ జిల్లా కోఆర్డినేటర్ డాక్టర్ జేవీ సుధీర్, డిస్ట్రిక్ట్ జైలర్ ప్రేమసాగర్, ఎన్‌సీసీ ఆఫీసర్ లత, ధాత్రికుమారి, సుబ్బరత్నం, టీజేపీఎస్, ఏసీ కాలేజీ, సిమ్స్, చలపతి కళాశాల విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



విజేతలకు డీఆర్‌ఎం కప్‌ని అందజేస్తున్న సాధు నరసింహారెడ్డి, రామకృష్ణ

డీఆర్‌ఎం కప్-2024ను గుంటూరు రైల్వే కైవసం

గుంటూరు, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): డీఆర్‌ఎం కప్-2024లో క్రికెట్ ట్రోఫీని గుంటూరు రైల్వే డీఆర్‌ఎం-11 కైవసం చేసుకుంది. నల్లపాడులోని రైల్‌విహార్‌లో ఆదివారం జరిగిన ఫైనల్స్ మ్యాచ్ ఏకపక్షంగా సాగింది. తొలుత బ్యాటింగ్ చేసిన ఎస్‌పీ గుంటూరు జట్టు 14 ఓవర్లలో కేవలం 53 పరుగులు మాత్రమే చేసి ఆలౌట్ అయింది. ఆ తర్వాత బ్యాటింగ్‌కు దిగిన డీఆర్‌ఎం-11 జట్టు కేవలం 10 ఓవర్లలో మూడు వికెట్లు కోల్పోయి 55 పరుగులు సాధించి వరుసగా రెండో ఏడాది క్రికెట్ ట్రోఫీని గెలుచుకుంది. మ్యాన్ ఆఫ్ ది సిరీస్‌గా సాగర్, ఉత్తమ బౌలర్‌గా జీవీ శరత్ బాబు అవార్డులను గెలుచుకొన్నారు. అనంతరం జరిగిన బహుమతి ప్రదానోత్స వంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న జీఎస్‌టీ కమిషనర్ సాధు నరసింహారెడ్డి మాట్లా డుతూ క్రీడలు మానసికోల్లాసానికి దోహదపడతాయన్నారు. అలాగే పోటీతత్వాన్ని పెంపొందిస్తాయని చెప్పారు. డీఆర్‌ఎం రామకృష్ణ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల మధ్య సమన్వయం కోసం తాము ఈ టోర్నమెంట్‌ని వరుసగా రెండో ఏడాది నిర్వహించామన్నారు. టోర్నమెంట్‌లో పాల్గొన్న క్రీడాకారులు, జట్లకు ఆయన అభినందనలు తెలిపారు. వచ్చే ఏడాది డీఆర్‌ఎం-కప్ 3వ ఎడిషన్‌లో కలుసుకొందామన్నారు. కార్యక్రమంలో ఏడీఆర్‌ఎం కే సైమన్, సీనియర్ డీవోఎం ఎం దినేష్‌కుమార్, సీనియర్ డీపీవో షేక్ షాబాజ్ హనూర్ పాల్గొన్నారు.

తుఫాన్ ప్రభావంతో ముందస్తు చర్యలు తీసుకోవాలి

● జీఎంసీ అధికారులకు కమిషనర్ ఆదేశాలు

గుంటూరు కార్పొరేషన్, డిసెంబర్ 1(ఆంధ్రజ్యోతి): 'ఫెంగల్' తుఫాన్ ప్రభావం వలన భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున ప్రజలు ఇబ్బంది పడకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని విభాగాధిపతులను ఆదేశించినట్లు జీఎంసీ కమిషనర్ పులి శ్రీనివాసులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. తుఫాన్ ప్రభావం వలన నగర ప్రజలకు ఏ సమస్య ఎదురైనా తక్షణం స్పందించడానికి జీఎంసీ అధికారులు సిద్ధంగా ఉండాలని, ప్రధానంగా లోతట్టు ప్రాంతాల్లో నీరు నిల్వకుండా, నిలిచిన ప్రాంతాల్లో యుద్ధప్రాతిపదికన బెయిల్ అవుట్ చేసేలా మోటార్లను అందుబాటులో ఉంచుకోవాలని ఆదేశించారు. చెట్ల కొమ్మలు పడిపోతే వెంటనే తొలగించేందుకు తగిన సామగ్రితో సిద్ధంగా ఉండాలని ఏడీహెచ్ ని ఆదేశించారు. విద్యుత్ సరఫరాలో ఏమైనా అంతరాయం ఏర్పడి తాగునీటి సరఫరాలో సమస్య రాకుండా జనరేటర్లను అందుబాటులో ఉంచాలని, అవసరమైన సిబ్బందికి ముందు గానే విధులు కేటాయించాలని ఆదేశించారు. వర్ష ప్రభావంతో ప్రజలు ఏమైనా ఇబ్బందులు ఎదుర్కొంటే నగరపాలక సంస్థ కాల్ సెంటర్ 0863-2345103 నంబరుకి ఫోన్ చేయాలని సూచించారు.

జైపూర్ స్టడీ టూర్‌కు నగర కమిషనర్

గుంటూరు కార్పొరేషన్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు రాజస్థాన్ రాజధాని జైపూర్‌కు స్టడీ టూర్ నిమిత్తం జీఎంసీ కమిషనర్ పులి శ్రీనివాసులు హాజరుకానున్నారు. జైపూర్ మున్సిపల్ కార్పొరేషన్‌లో వీధి దీపాల పర్యవేక్షణ వ్యవస్థ, రోడ్ల నిర్వహణ, సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్, ద్రవ వ్యర్థాల నిర్వహణ, ఇతర ఉత్తమ పద్ధతుల అమలవుతున్న తీరుపై పరిశీలన, అధ్యయనం నిమిత్తం ఈ నెల 2,3 తేదీల్లో ఆయన హాజరుకానున్నారు. 4 నుంచి కమిషనర్ అందుబాటులో ఉంటారు.



మాట్లాడుతున్న జీఎస్టీ కమిషనర్ నరసింహారెడ్డి, పక్కన లక్ష్మణ రెడ్డి తదితరులు

కృషి, పట్టుదలతో ఉన్నత శిఖరాలను చేరుకోగలం

● సెంట్రల్ జీఎస్టీ కమిషనర్ సాధు నర్సింహారెడ్డి

గుంటూరు కార్పొరేషన్, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): దృఢమైన సంకల్పంతో, కృషి, పట్టుదలతో జీవితంలో ఉన్నత శిఖరాలను చేరుకోగలమని కస్టమ్స్, సెంట్రల్ జీఎస్టీ కమిషనర్ సాధు నరసింహారెడ్డి పేర్కొన్నారు. స్థానిక భాష్యం ఆడిటోరియంలో మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం గుంటూరులోని జరిగిన నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ పరీక్ష శిక్షణా తరగతుల ముగింపు కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా నర్సింహారెడ్డి మాట్లాడుతూ అతి పేదరికం అనుభవిస్తూ దృఢమైన సంకల్పంతో అత్యున్నత స్థాయికి ఎదిగిన ఐఏఎస్ అధికారి కట్టా సింహాచలం, రేవు ముత్యాలరాజు,ఎన్. బలరామ్ నాయక్, గోవింద్ జైస్వాల్, బి. రాజకుమారి లాంటి ఉన్నతాధికారుల అభివృద్ధి క్రమాన్ని వివరించారు. జన చైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి మాట్లాడుతూ మానవత సంస్థ గత రెండు నెలలుగా ప్రతి ఆదివారం ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న 350 మంది విద్యార్థినీవిద్యార్థులకు అనుభవజ్ఞులైన ఫ్యాకల్టీతో శిక్షణ ఇప్పించడం అభినందనీయమన్నారు. మాన వత చైర్మన్ పావులూరి రమేష్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో ఎనిమిదవ తరగతి చదువుతున్న 350 మంది పేద విద్యార్థులకు ఉచిత శిక్షణ ద్వారా ఎన్‌ఎం ఎంఎస్ పరీక్షల్లో ఉత్తీర్ణులై కేంద్ర ప్రభుత్వం మెరిట్ స్కాలర్‌షిప్‌ను పొందగలరనే ఆశాభావం వ్యక్తం చేశారు. మాన వత కార్యదర్శి కె. సతీష్ మాట్లాడుతూ నలభై ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు క్రమశిక్షణతో శిక్షణా తరగతులకు హాజరు కావడంపై సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మానవత అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీనివాసరావు సంస్థకు లక్ష రూపాయల విరాళాన్ని ప్రక టించారు. ఈ కార్యక్రమంలో మానవత ప్రతినిధులు ఉప్పల సాంబశివరావు, చావ శివాజీ, వర్రె సుబ్రహ్మణ్యం, టీ ధనుంజయ రెడ్డి, కె ఆనంద్, ఎన్ సాంబశివరావు, లక్ష్మీ సామ్రాజ్యం తదితరులు మాట్లాడారు.

జీవీ కృష్ణారావు పోరాటాలు చిరస్మరణీయం

● ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు రావులపల్లి రవీంద్రనాథ్



మాట్లాడుతున్న రావులపల్లి రవీంద్రనాథ్, పాల్గొన్న జంగాల అజయ్‌కుమార్ తదితరులు

గుంటూరు(తూర్పు), డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): పేద, కార్మిక వర్గ సంక్షేమానికి నిరంతరం శ్రమించిన అన్ని వర్గాల మన్ననలు పొందిన పోరాట యోధుడు జీవీ కృష్ణారావు అని ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు రావులపల్లి రవీంద్రనాథ్ కొనియాడారు. ఏటుకూరు రోడ్డు లోని రేగుల రాఘవయ్య భవన్ వద్ద ఆదివారం జీవీ కృష్ణారావు వర్ధంతి, సంస్మరణసభను నిర్వహించారు. సభకు హమాలీ(ముఠా) ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు చల్లా చిన ఆంజనేయులు అధ్యక్షత వహించారు. రవీంద్రనాథ్ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా లక్షలాది మంది అసంఘ టిత కార్మికులను ఐక్యం చేసిన ఘనత కృష్ణారావుకు దక్కుతుందని అన్నారు. ఆయన పోరాటాల స్ఫూర్తితో అసంఘటిత రంగంలో కార్మిక వర్గానికి సంక్షేమబోర్డు ఏర్పాటు చేయాలని ఉద్యమించాలన్నారు. సీపీఐ జిల్లా కార్యదర్శి జంగాల అజయ్ కుమార్ మాట్లాడుతూ మల్లయ్య లింగం తర్వాత అనేక కార్మిక సంఘాల నిర్మాణంలో కృష్ణమూర్తి కీలకపాత్ర పోషించారని గుర్తుచేశారు. ఈ సందర్భంగా జీవీ కృష్ణారావు విశేష పురస్కారాన్ని మున్సిపల్ ఫెడరేషన్ సీనియర్ నాయకుడు నెక్కంటి సుబ్బారావుకు అందజేశారు. వెంకటసుబ్బయ్య, మేడా హనుమంతురావు తదితరులు పాల్గొన్నారు.



ప్రదర్శనలో మెజీషియన్స్, పాల్గొన్న చిన్నారులు

ఆకట్టుకున్న ఇంద్రజాల ప్రదర్శన

గుంటూరు(తూర్పు), డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): ఏపీ మెజీషియన్స్ అసోసియేషన్ ఇంద్రజాల ప్రదర్శన నిర్వహించారు. స్థానిక బృందావన్ గార్డెన్స్ శ్రీ వేంకటేశ్వరస్వామి దేవాలయం పద్మావతి కళ్యాణ వేదికపై ఆదివారం నిర్వహించిన ఈ ప్రదర్శన నిర్వహించారు. ఆలయ సంయుక్త కార్యదర్శి ఊటుకూరి నాగేశ్వరరావు జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆర్‌ఎల్ ప్రసాద్ ఆధ్వర్యంలో మెజీషియన్స్ డాక్టర్ అర్నల్, జె.వి.ఆర్, అద్దంకి నాగరాజు, డాక్టర్ పీవీ రామ్‌కుమార్, నాగేంద్రల ఇంద్రజాల ప్రదర్శన ఆకట్టుకుంది. అనంతరం మెజీషియన్స్‌ను నిర్వాహకులు ఘనంగా సత్కరించారు.

గ్రామీణ నాటక వికాసానికి దోహదపడిన 'కొడాలి గోపాలరావు'



మాట్లాడుతున్న సాంబశివరావు, పాల్గొన్న శివప్రసాదు తదితరులు

గుంటూరు(తూర్పు), డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): గ్రామీణ నాటక రంగ వికాసానికి నాటక రచయిత కొడాలి గోపాలరావు చేసిన కృషి చిరస్మరణీయమని నాటకరంగ పరిశోధకుడు డాక్టర్ కంది మళ్ల సాంబశివరావు అన్నారు. స్థానిక ఏఎల్‌బీఈడీ కళాశాల ఆవరణలో జరుగుతున్న విశాలాంధ్ర పుస్తక మహోత్సవంలో ఆలూరి బైరాగి సాహిత్య వేదికపై 'కొడాలి గోపాలరావు' నాటక సాహిత్యంపై చర్చ నిర్వహిం చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగు నాటకరంగంలో గోపాలరావు, గంగధరరావు శతాధిక నాటక రచ యితలుగా గుర్తింపు పొందారని అన్నారు. సభకు అరసం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వల్లూరి శివప్రసాదు అధ్యక్షత వహించారు.

మండల, డివిజన్ స్థాయిలో పీజీఆర్ఎస్ అమలు

గుంటూరు(తూర్పు), డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ (పీజీఆర్ఎస్) అర్జీల స్వీకరణ కార్యక్రమాన్ని జిల్లా కేంద్రంతో పాటు మండల, డివిజనల్, మున్సిపల్ స్థాయిలో నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ ఎస్ నాగలక్ష్మి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్జీదారులు ఈ విషయాన్ని గమనించి తమ ఫిర్యాదులను సమీపంలోని ఆయా కార్యాలయాలలో అందజేయాలని సూచించారు. పాలనను ప్రజలకు మరింత చేరువ చేసేందుకు ఈ కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. జిల్లా ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

రిషితేశ్వరి కుటుంబానికి న్యాయం చేయాలి



శంకర్‌విలాస్ సెంటర్‌లో నిరసనలో పాల్గొన్న ఐద్వా మహిళలు, ఎస్‌ఎఫ్ఐ నాయకులు

గుంటూరు(తూర్పు), డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున యూనివర్శిటీ విద్యార్థిని రిషితేశ్వరి ఆత్మహత్య ఘటనలో నిందితులను కఠినంగా శిక్షించి, ఆమె కుటుంబానికి న్యాయం చేయాలని ఐద్వా, ఎస్ఎఫ్ఐ నాయకులు డిమాండ్ చేశారు. స్థానిక శంకర్ విలాస్ సెంటరులో ఆదివారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత తొమ్మిదేళ్లగా జరిగిన న్యాయ విచారణలో కేసు కొట్టివేయడం బాధాకర మన్నారు. రాష్ట్ర ప్రభుత్వం బాధ్యత తీసుకుని రిషితేశ్వరి కేసును హైకోర్టులో అపీల్ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో లక్ష్మణరావు, ఎల్ అరుణ, కిరణ్, సమీర్, యశ్వంత్, నరేంద్ర. శివాజీ, సందీప్, సుభాని, శివాజీ, రిహాన్, షంషీర్ తదితరులు పాల్గొన్నారు.

అవినీతి, అరాచకాల్లో జగన్‌ది ప్రపంచస్థాయి: కనపర్తి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న కనపర్తి శ్రీనివాసరావు

గుంటూరు, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): అవినీతి, అరాచకాల్లో ప్రపంచస్థాయి నేరస్థుడిగా పేరుతెచ్చుకున్న వైసీపీ అధినేత జగన్మోహనరెడ్డిని రాష్ట్ర ప్రభుత్వం ఏదో ఒక అవార్డుతో సత్కరించి, సన్మానాలు చేయకపోతే ఆయన పిచ్చి పరాకాష్టకు చేరే ప్రమాదముందని టీడీపీ రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి కనపర్తి శ్రీనివాసరావు ఎద్దేవా చేశారు. తెలుగుదేశం పార్టీ జిల్లా కార్యాలయంలో ఆది వారం ఆయన విలేకరులతో మాట్లాడారు. జగన్ మానసిక పరిస్థితి పూర్తిగా దెబ్బ తిన్నట్లుందని, ఆయనకు తగిన వైద్యం అందించకపోతే పరిస్థితి విషమించినా విషమించవచ్చని సెటైర్లు వేశారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి అంబటి రాంబాబుపై కనపర్తి విరుచుకుపడ్డారు. మరుగుదొడ్డి శుభ్రం చేస్తూ ప్రమాదవశాత్తు మరణించిన నిరు పేదకు, ప్రభుత్వం నుంచి వచ్చే ఆర్థికసాయంలో కూడా లంచం అడిగారని ఆయన మండి పడ్డారు. పవన్ వ్యాఖ్యలను అర్థం చేసుకునే స్థాయికి అంబటి ఎదగలేదని, ఉద్యోగ వ్యవస్థను జగన్ ఏ స్థాయికి దిగజార్చాడో చెప్పుకునే చెప్పాడని అన్నారు. అంబటికి దమ్మూ ధైర్యం ఉంటే ఉప సభాపతి రఘురామ కృష్ణరాజు, డాక్టర్ కాదంబరి జత్వాని ఉదంతాలపై బహిరంగ చర్చకు రావాలని సవాల్ చేశారు. కాకినాడ పోర్టును రేషన్ బియ్యం సరఫరాకు అడ్డాగా మార్చి వేల కోట్లు దండుకున్న ద్వారంపూడి సోదరుల అవినీతిపై సీబీడీ విచారణ జరిపి, వారిని పీడీ యాక్టు కింద అరెస్టు చేయాలన్నారు. మద్యం, ఇసుక, మైనింగ్ కుంభకోణాల నుంచి జగన్ బయట పడటం అసాధ్యమని అన్నారు. జగన్ సినిమాకు జనం శుభం కార్డు వేశా రని, అంతరించిన ప్రాంతీయ పార్టీల జాబితాలో వైసీపీ త్వరలో చేరనుందని కనపర్తి అన్నారు. సమావేశంలో టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు అడకా శ్రీనివాసరావు పాల్గొన్నారు.



అరండల్‌పేట నాల్గో లైనులోని శివాలయంలో అయ్యప్ప దీక్షాదారులకు సద్ది ప్రారంభిస్తున్న శిరిపురపు శ్రీధర్‌శర్మ

అయ్యప్ప దీక్షాదారులకు సద్ది ప్రారంభం

గుంటూరు, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): సనాతన ధర్మంలో అన్న సమారాధనను మించిన సేవా కార్యక్రమం మరొకటి లేదని అయ్యప్ప సేవా సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు సిరిపురపు శ్రీధర్ అన్నారు. అయ్యప్ప సేవా సమాఖ్య ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక అరండల్ పేట నాల్గో లైనులోని శ్రీ హంపి విరూపాక్ష పీఠ పాలిత శివాలయంలో అయ్యప్ప స్వాములకు, దీక్షా స్వాములకు 41 రోజులు పాటు నిత్య అన్న సమారాధన కార్యక్రమాన్ని ఆలయ ధర్మకర్త ఏకా ప్రసాద్‌తో ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్రీధర్ మాట్లాడుతూ గత ఇరవై ఏళ్లగా తాము సద్ది కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. దాతల సహకారంతో 41 రోజుల పాటు మధ్యాహ్నం సద్ది,రాత్రి భిక్షా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని తెలియజేశారు దీక్షాదారులు వినియోగించుకోవాల్సిందిగా శ్రీధర్ విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో అర్చ కులు కుందుర్తి భాస్కర్ శర్మ, సుబ్రమణ్య శర్మ, డి.యస్.బాబు, మన్నవ రాధాకృష్ణరేజేటి సతీష్, పెరుమాళ్ళ సాయి శ్రీనివాస్ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్జీవీని నడిరోడ్డులో ఈడ్చుకుంటూ తీసుకురావాలి

● ఏపీ లిడ్ క్యాప్ చైర్మన్ పిల్లి మాణిక్యరావు

గుంటూరు, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): సినీ దర్శకుడు రామ్‌గోపాల్‌వర్మను నడిరోడ్డులో ఈడ్చుకుంటూ పోలీసులు బయటకు తీసుకురావాలని ఏపీ లిడ్ క్యాప్ చైర్మన్ పిల్లి మాణిక్యరావు ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. మహిళలను దారుణంగా మార్ఫింగ్‌తో వేధించి, విచ్చలవిడిగా ట్వీట్లు పెట్టి రెచ్చిపోయి మాట్లాడి, నేడు మర్చిపోయానని మాట్లాడే వర్మకు ఏపీ పోలీసులు అన్నీ గుర్తుకొచ్చేలా చేయాలని అన్నారు. ఆర్జీవీ వెటకారపు మాటలకు పోలీసులు సరైన సమాధానం చెప్పాలన్నారు. పోలీసులకు డిమాండ్ పెట్టి ఆ ప్రకారమైతేనే విచారణకు వస్తానంటే ఏపీ పోలీసులు చేతకాని వారా? అని ప్రశ్నించారు. వర్మ ట్వీట్ల వెనుక ఆనాటి ప్రతిపక్షాలను మానసిక వేదనకు గురిచేసి, రాజకీయాల నుంచి తప్పించాలనే కుట్ర, అసాంఘిక చర్యలను ప్రేరేపించాలనే దురుద్దేశాలు ఉన్నాయన్నారు. పారిపోవ డానికి, దాక్కోవడానికి తేడా లేదని ఆర్జీవీకి పోలీసులు వారి స్టైల్‌లో బుద్ధి చెప్పాలన్నారు.



పోటీలలో పాల్గొన్న క్రీడాకారులు, కోచ్‌లు

హోరాహోరీగా ఫుట్‌బాల్ పోటీలు

గుంటూరు(తూర్పు), డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక పేరేచర్ల మైదానంలో జరుగుతున్న ఫుట్‌బాల్ పోటీలు హోరా హోరీగా జరుగుతున్నాయి. అండర్-12, 14 బాలుర విభాగాల్లో నిర్వహిస్తున్న ఈ పోటీలకు ఆయా పాఠశాలలకు చెందిన క్రీడాకారులు పాల్గొన్నారు. అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి కే క్రాంతికుమార్, జిల్లా కార్యదర్శి దుర్గా మోహన్ పర్యవేక్షించారు.

కొబ్బరి నీళ్లు తాగేద్దాం!

కొబ్బరి నీళ్లు ఆరోగ్యానికి మంచివని అందరికీ తెలుసు. వేసవికాలంలోనే కాదు చలికాలంలో కూడా తాగవచ్చు. కొబ్బరినీళ్లు తాగడం వల్ల శరీరానికి ఎన్నో పోషకాలు, ఖనిజాలు, మినరల్స్ అందుతాయి. చలికాలంలో కొబ్బరి నీళ్లు అందించే ఆరోగ్య ప్రయోజనాల గురించి తెలుసుకుందాం.



చర్మానికి : చలికాలంలో కొబ్బరినీళ్లు తరచూ తాగడం వల్ల శరీరంలో తేమ శాతం పెరుగుతుంది. దీనివల్ల చర్మం పొడారిపోకుండా మృదువుగా ఉంటుంది. ముఖంపై పగుళ్లు, మొటిమలు రాకుండా ఉంటాయి. రాత్రి పడుకునేముందు ముఖాన్ని కొబ్బరి నీళ్లతో కడిగితే మచ్చలు మాయమై చర్మం కాంతివంతంగా మారుతుంది.

రోగనిరోధక శక్తి: కొబ్బరి నీళ్లలో రెబోఫ్లేవిన్, నియాసిన్, థయామిన్, పిరిడాక్సిన్ విటమిన్లతోపాటు యాంటీ వైరల్, యాంటీ బ్యాక్టీరియల్ గుణాలు అధికంగా ఉంటాయి. ఇవి శరీరానికి తక్షణ శక్తితోపాటు ఉత్సాహాన్ని, చురుకుదనాన్ని అందిస్తాయి. చలికాలంలో తరచూ వేధించే అనేక అనారోగ్య సమస్యలను తట్టుకునేందుకు అవసరమైన రోగనిరోధక శక్తిని పెంచుతాయి. కొబ్బరినీళ్లలో ఉండే సహజ చక్కెరలు, ఎలక్ట్రొలైట్లు శరీరాన్ని ఉత్తేజితం చేసి చలికాలంలో వచ్చే బద్ధకాన్ని పోగొడతాయి.

బరువు : కొబ్బరి నీళ్లలో కొవ్వు శాతం చాలా తక్కువగా ఉంటుంది. పీచు పదార్థాలు, పిండి పదార్థాలు ఎక్కువగా ఉంటాయి. అందుకే కొబ్బరి నీళ్లు తాగిన వెంటనే చాలా సమయం వరకు కడుపు నిండిన భావన ఉంటుంది. దీనివల్ల త్వరగా ఆహారం తీసుకోవాలని అనిపించదు. క్రమంగా శరీర బరువు నియంత్రణలోకి వస్తుంది. బరువు తగ్గాలనుకునేవారు ప్రతిరోజూ కొబ్బరినీళ్లు తాగితే మంచి ఫలితం కనిపిస్తుంది.

జీర్ణక్రియ : కొబ్బరినీళ్లు తాగడం వల్ల కడుపులో ప్రేగు కదలికలు సక్రమంగా ఉంటాయి. జీర్ణక్రియ సులభంగా జరుగుతుంది. మలబద్ధకం సమస్య రాదు. కొబ్బరి నీళ్లలోని ఆల్కలీన్ గుణాలు పొట్టలో పీహెచ్ స్థాయిని తటస్థం చేస్తాయి. దీనివల్ల కడుపులో మంట, అజీర్ణం వంటి సమస్యలు రావు. కాలేయం ఆరోగ్యంగా ఉంటుంది. కొబ్బరి నీళ్లలో ఉండే పొటాషియం శరీరంలోని అదనపు నీటిని, ఇతర వ్యర్థ పదార్థాలను బయటికి పంపుతుంది. రక్తపోటుని నియంత్రిస్తుంది. మూత్రపిండాల్లో రాళ్లు ఏర్పకుండా కాపాడుతుంది.

గుండె : తరచూ కొబ్బరి నీళ్లు తాగడం వల్ల రక్త ప్రసరణ వ్యవస్థ అదుపులో ఉంటుంది. రక్తంలో చెడు కొలెస్ట్రాల్, ట్రైగ్లిజరైడ్ స్థాయిలు తగ్గుతాయి. దీనివల్ల గుండె సంబంధిత సమస్యలు రాకుండా ఉంటాయి. కొబ్బరి నీళ్లలో ఉండే మెగ్నీషియం శరీరంలో ఇన్సులిన్ పనితీరుని మెరుగుపరుస్తుంది. దీనివల్ల రక్తంలో చక్కెర స్థాయి నియంత్రణలో ఉంటుంది.

శక్తి : చలికాలంలో వ్యాయామం చేసిన తరవాత లేదంటే ఆటలు ఆడిన తరవాత శరీరానికి నిస్సత్తువ ఆవరిస్తుంది. ఇటువంటి సమయంలో వెంటనే కొబ్బరి నీళ్లు తాగితే శారీరక శ్రమ నుంచి ఉపశమనం లభిస్తుంది. కొబ్బరి నీళ్లలో ఉండే ఎలక్ట్రొలైట్లు, ఖనిజ లవణాలు తక్షణ శక్తిని అందిస్తాయి.

సి విటమిన్ లోపిస్తే...



విటమిన్ 'సి' మన ఆరోగ్యానికి అత్యవసరమైన పోషకం. రోగనిరోధక శక్తిని పెంచడంలో దీని పాత్ర కీలకం. గుండె, చర్మం, ఎముకలు, కండరాలు, దంతాలను ఆరోగ్యంగా ఉంచుతుంది. మన శరీరంలో విటమిన్ 'సి' లోపిస్తే వచ్చే అనారోగ్య సమస్యల గురించి తెలుసుకుందాం.

రక్తహీనత : మనం తీసుకునే ఆహారపదార్థాల నుంచి ముఖ్యంగా శాకాహారం నుంచి ఐరన్‌ను గ్రహించడంలో శరీరానికి సి విటమిన్ సహాయం తప్పనిసరి. విటమిన్ సి తగిన పరిమాణంలో లేని పక్షంలో శరీరానికి ఐరన్ అందక రక్తం ఉత్పత్తి కాదు. దీంతో రక్తహీనత సమస్య వస్తుంది. శాకాహారుల్లో ఈ సమస్య అధికంగా ఉంటుంది.

అంటువ్యాధులు : సి విటమిన్ లోపించడం వల్ల రోగనిరోధక శక్తి తగ్గుతుంది. ఫలితంగా పలు రకాల అంటువ్యాధులు వచ్చే ప్రమాదం ఉంటుంది. జలుబు, దగ్గు, జ్వరం, న్యుమోనియా వంటివి తరచూ వేధిస్తుంటాయి.

ఎముకలు విరగడం : ఎముకలు బలంగా ఉండేందుకు కావాల్సిన కాల్షియాన్ని శరీరం సంగ్రహించేందుకు సి విటమిన్ తోడ్పడుతుంది. దీని లోపం వల్ల శరీరం కాల్షియాన్ని శోషించుకోలేదు. ఫలితంగా ఎముకలు బలహీనమై ఆస్టియోపోరోసిస్ అనే వ్యాధి వస్తుంది. చిన్నపాటి ప్రమాద సంఘటనలకే ఎముకలు విరిగిపోతుంటాయి. గోళ్లు పెళుసుగా మారతాయి.

కండరాలు బలహీనం : సి విటమిన్ లోపిస్తే శరీరంలో 'కొల్లాజెన్' అనే ప్రొటీన్ ఉత్పత్తి కాదు. దీంతో కండరాలు, ఎముకల మధ్య అనుసంధానం దెబ్బతింటుంది. రక్తనాళాల గోడలు బలహీనమై కండరాల్లో వాపుని నొప్పిని కలిగిస్తాయి. గాయాలు తొందరగా నయం కావు.

దృష్టి దోషాలు : శరీరానికి సి విటమిన్ అందకపోతే తొందరగా వార్ధక్య లక్షణాలు ఎదురవుతాయి. కంటిచూపును అందించే రెటీనాలో ప్రధాన భాగమైన మాక్యులాలో అసాధారణ స్రావాలు విడుదలవుతాయి. దీంతో మాక్యులా పొరలు ఉబ్బి కంటి చూపు మందగిస్తుంది. రంగులను గుర్తించడం కష్టమవుతుంది.

అలసట: సి విటమిన్ లోపం కారణంగా శరీరంలో శక్తి ఉత్పత్తి వ్యవస్థ దెబ్బతింటుంది. దీంతో శరీరానికి కావాల్సిన శక్తి లభించక ఎప్పుడూ నీరసంగా, బలహీనంగా అనిపిస్తుంది. ఎంత బలమైన ఆహారం తీసుకున్నప్పటికీ అలసటగా, మత్తుగా అనిపిస్తుంది. ఏకాగ్రత కుదరక మానసిక సమస్యలు ఏర్పడతాయి.

నోటి సమస్యలు: విటమిన్ సి లోపం వల్ల దంతాలు, చిగుళ్లు బలహీనమవుతాయి. డెంటిన్ అనే పదార్థం ఏర్పడక పోవడంతో దంతాల్లోని రక్తనాళాలు పెళుసుగా మారతాయి. పళ్లు తోముతున్నపుడు కలిగే చిన్నపాటి ఒత్తిడికే రక్తనాళాలు చిట్లి చిగుళ్ల నుంచి రక్తం స్రవిస్తుంది. చిగుళ్లలో వాపు, నొప్పి కూడా బాధిస్తుంటాయి.

ఆంధ్రజ్యోతి

నవ్య 8

కుటుంబ కదంబం

సోమవారం • 2 డిసెంబరు 2024

సినీ కుటుంబ నేపథ్యం. కానీ పరిశ్రమ వైపు వెళ్లలేదు. సంగీత సాగరంలో తనకంటూ కొన్ని తీపి గుర్తులు ఉండాలనే తాపత్రయం. అందుకే మూడు దశాబ్దాలుగా స్వర సంగమంలో మునిగిపోయారు.
వేదికలెక్కి... వేల ప్రదర్శనలు ఇచ్చి... ప్రతిష్ఠాత్మక 'ఉస్తాద్ బిస్మిల్లాఖాన్ యువ పురస్కారం' అందుకున్నారు.
అలనాటి ప్రముఖ నటుడు 'రక్తకన్నీరు' నాగభూషణం మనవరాలు... కర్ణాటక సంగీత కళాకారిణి... **శ్వేతా ప్రసాద్**తో 'నవ్య' ముచ్చట్లు.



సుస్వర సంగీత ఝరి

"ఒకరి పేరు చెప్పుకొని కాదు... మనకంటూ ఒక ప్రత్యేక గుర్తింపు ఉండాలనేది నా అభిమతం. అందుకు నేను ఎంచుకున్న మార్గం సంగీతం. మూడేళ్లప్పుడు మొదలుపెట్టాను. మూడు దశాబ్దాలుగా పాడుతూనే ఉన్నాను. సరిగమల ప్రవాహంలో సాగిపోతున్నాను. దానికి ప్రతిఫలమే ఇటీవల నేను అందుకున్న 'ఉస్తాద్ బిస్మిల్లాఖాన్ యువ పురస్కారం'. నాకు 2022 సంవత్సరానికి గానూ కర్ణాటక సంగీతంలో వచ్చింది. ఢిల్లీలో 'కేంద్ర సంగీత నాటక అకాడమీ' ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఈ అవార్డులను ప్రదానం చేశారు. యువ కళాకారులకు ఇది 'పద్మశ్రీ'తో సమానం. స్వయంకృషితో ఎదిగి, ఇంతటి ప్రతిష్ఠాత్మక పురస్కారం తీసుకోవడం సంతోషంగా ఉంది. ఎంతో గర్వంగా అనిపిస్తోంది.

సంగీత జ్ఞానం ఉన్నవారే...

సంగీతాభిరుచి నాకు మా నాయనమ్మ శశిరేఖ నుంచి వచ్చింది. ఆవిడ కర్ణాటక సంగీతం చాలా బాగా ఆలపిస్తారు. మా తాత నాగభూషణం గారి 'రక్తకన్నీరు' నాటకానికి చాలా ఏళ్ల నాయనమ్మే పాడేవారట. నాన్న రవీంద్రనాథ్‌ది మేనరికం. మా అమ్మ ప్రసన్నకు మేనత్తే మా నాయనమ్మ. అమ్మ వైపు అందరికీ సంగీతంలో ప్రవేశం ఉంది. ఒకరు వయోలిన్ వాయించేవాళ్లు. ఒకరు హార్మోనియం... మరొకరు గాత్రం. కాకపోతే ఎవరూ ఎక్కడా నేర్చుకోలేదు. అలా నాకూ నాయనమ్మ వారసత్వం వచ్చింది. నేను పుట్టి పెరిగింది హైదరాబాద్‌లోనే. సంగీతంలో రామలక్ష్మి రంగాచారి గారు నా తొలి గురువు. ఐదారేళ్ల తరువాత నేతి శ్రీరామ్ గారి వద్ద శిష్యరికం చేశాను. మొత్తం పదహారేళ్లపాటు సంగీతం నేర్చుకున్నాను. ఉస్మానియా విశ్వవిద్యాలయంలో బీకాం తరువాత ఎంఏ మ్యూజిక్ చదివాను. ప్రస్తుతం కర్ణాటక సంగీతంలో ఎంఫిల్ చేస్తున్నాను.

పిలిచి పాడించేవారు...

పదో ఏట నుంచే కూచిపూడి, భరతనాట్యం ప్రదర్శనలకు పాడేదాన్ని. మా తాతగారిని కలవడానికి పెద్ద పెద్ద నటులు, నాయకులు ఇంటికి వచ్చేవారు. నన్ను పిలిచి... 'ఇది నా మనవరాలు. బ్రహ్మాండంగా పాడుతుంది... వినండి' అని నాతో వాళ్ల ముందు పాడించేవారు. ఎక్కువగా కమ్యూనిస్టు పాటలు పాడమనేవారు. నాయనమ్మకు పక్షవాతం వచ్చి పన్నెండేళ్లు మంచం మీదే ఉన్నారు. అప్పట్లో తను సొంతంగా రాసుకున్న గీతాలు నేను పాడి వినిస్తుంటే ఎంతో ఉద్వేగానికి లోనయ్యేవారు. తాత కూడా కన్నీళ్లు పెట్టుకొనేవారు.

ఆ ఇద్దరూ భలే ఇష్టం...

తాత గారికి ఐదుగురు సంతానం. ముగ్గురు అబ్బాయిలు, ఇద్దరు అమ్మాయిలు. ఇక మా ఇంట్లో నేనే పెద్దదాన్ని. తమ్ముడు కౌశిక్ హోటల్ మేనేజ్‌మెంట్ చదివి, అదే రంగంలో స్థిరపడ్డాడు. చిన్నప్పుడు తాతయ్య మాతో చాలా సరదాగా గడిపేవారు. మా మధ్య చాలా సంభాషణలు జరిగేవి. 'రోజూ మేకప్ వేసుకొని తీయాలంటే చికాగ్గా ఉండదా' అని అడిగితే... 'అవునే..! మేకప్ కోసం తెల్లవారుజాము మూడింటికి లేచేవాడిని. మంచం మీద పడుకొంటే ముఖానికి రంగు వేసేసేవాళ్లు' అనేవారు నవ్వుతూ. నచ్చిన నటులు ఎవరని అడిగేవాళ్లం. ఆయన ఎప్పుడూ జయప్రద గారి గురించి గొప్పగా చెప్పేవారు. 'ఏంటోనే... ఆ అమ్మాయిని చూస్తుంటే అమ్మవారిలా అనిపిస్తుంది. ఏం అందం ఆ అమ్మాయిది' అనేవారు. ఆవిడ కూడా తాతయ్యను ఆప్యాయంగా 'డాడీ' అని పిలిచేవారు. అలాగే సూర్యకాంతం గారి వ్యక్తిత్వం ఆయనకు బాగా నచ్చేది. ఇద్దరూ 'ఒరేయ్ అన్నయ్యా' అంటే 'ఒరేయ్ అన్నయ్యా' అని పిలుచుకొనేవారట. ఆవిడ మహా సరదా మనిషిట. షూటింగ్‌లో కాస్త ఖాళీ దొరికితే చాలు... 'ఒరేయ్ అన్నయ్యా... రా ఆడుకొందాం' అని ఎడం చేత్తో పేక ముక్కలు అలా వేసిపడేసేవారట. ఫ్రీగా ఆడమంటే అస్సలు ఒప్పుకొనేవారు కాదుట. డబ్బులకు తప్ప ఆడేవారు కాదుట. ఇంట్లో అందరికీ వండి పెట్టడమంటే సూర్యకాంతం గారికి మహా ఇష్టమని చెప్పేవారు తాతయ్య.

ఎందుకో ఒప్పుకోలేదు...

నేను ఎనిమిదో తరగతిలో ఉండగా మా తాత చనిపోయారు. ఎందుకో తెలియదు... ఆయన తన పిల్లలు ఎవర్నీ సినిమాల్లోకి రానీయలేదు. నేను పుట్టేనాటికి... అంటే 1983కు ముందే పరిశ్రమతో సంబంధాలు తెంచుకుని హైదరాబాద్‌కు వచ్చేశారు. మా నాన్న కోసం దాసరి నారాయణరావు తదితరులు బోలెడన్ని కథలు రాసుకున్నారు. 'రవిబాబు కోసం నేను ఈ కథ రాసుకున్నా. బాబును నాకు వదిలెయ్... ఐదేళ్లలో సూపర్‌స్టార్‌ను చేస్తా' అనేవారు దాసరి. నాన్నది మంచి పర్సనాలిటీ. చూడ్డానికి చాలా బాగుంటారు. అయితే తాత గారు ససేమిరా అన్నారు. 'ఏమైనా చెప్పండి. అటువైపు నా పిల్లలను పంపించను' అని తెగేసి చెప్పేవారట. నేను కూడా కీరవాణి, కోటి, మణిశర్మ గార్ల సినిమాలకు పదేళ్లపాటు కోరస్ పాడాను. అదికూడా తాతకు నచ్చేది కాదు. 'ఎందుకు పంపిస్తున్నావురా పిల్లని' అని నాన్నపై కోప్పడేవారు. నలభై ఏళ్లకు పైగా పరిశ్రమలో ఉన్న ఆయన అంత కచ్చితంగా చెబుతున్నారంటే ఆలోచించాలి కదా!

వేల ప్రదర్శనలు...

ప్రస్తుతం నాకు, మావారు రేణుకా ప్రసాద్‌కు సంగీతమే వృత్తి. ఇదే మా జీవితం. ఆయన మృదంగం వాయిస్తారు. నట్టువాంగం చేస్తారు. మాకు ఒకతే అమ్మాయి... ప్రసిద్ధ. ఇంటర్ ఫస్ట్ ఇయర్ చదువుతోంది. వయోలిన్ బ్రహ్మాండంగా వాయిస్తుంది. నేను, మావారు ఇప్పటికి మూడు వేల ప్రదర్శనల వరకు ఇచ్చివుంటాం. ఏటా అమెరికా వెళతాం. కచేరీలు, గెస్ట్ లెక్చరర్స్ ఇస్తాం. సంగీత తరగతులు, వర్క్‌షాప్‌లు నిర్వహిస్తున్నాం. శోభానాయుడు గారికి పాతికేళ్లు పాడాను. ఆనంద్ శంకర్, స్వప్నసుందరి తదితర ప్రముఖ నాట్యకారులందరికీ నేనే పాడుతున్నాను. ఇవికాకుండా ఎన్నో కచేరీలు చేశాను. తమన్ గారు అడిగితే 'సర్కారువారి పాట' చిత్రంలోని 'కళావతి' పాటలో జతులు ఆలపించాను. నాని 'అంటే సుందరానికి' చిత్రం 'పంచె కట్టు' పాట తమిళం, మళయాళం వెర్షన్లు పాడాను. ఇంతకుమించి సినిమా పాటలు పాడలేదు.

పెద్దగా కోరికలు లేవు...

కొవిడ్ సమయంలో సంపాదన లేక కొన్ని రోజులు ఇబ్బంది పడినా... అమ్మవారి దయవల్ల మా జీవితం ఇప్పుడు సంతోషంగా సాగిపోతోంది. మాది పదహారు మంది ఉన్న ఉమ్మడి కుటుంబం. కోట్లు సంపాదించాలి... బెంజిలో తిరగాలనే కోరికలేవీ మాకు లేవు. ముప్పై ఏళ్లుగా పాడుతున్నాం. వచ్చిన డబ్బుతో ఇల్లు కొనుక్కున్నాం. కారు ఉంది. ఇబ్బందులు లేకుండా సంసారం సాగిపోవడానికి సరిపడా సంపాదన వస్తోంది. ఒక మనిషి ఆనందంగా జీవించడానికి ఇంతకంటే ఏంకావాలి! చుట్టూ మన అనుకొనే మనుషులు... నాలుగు కచేరీలు ఉంటే చాలు మాకు."

• హనుమా



అమ్మవల్లే ఇక్కడివరకు...

సంగీతంలో నేను ఈ స్థాయికి రావడానికి మా అమ్మే కారణం. చిన్నప్పుడు సంగీత తరగతులకు వెళ్లనని ఏడ్చేదాన్ని. అయినా అమ్మ వినేది కాదు. 'నీకు భగవంతుడు మంచి గొంతు ఇచ్చాడు. నువ్వు ఏమైనా చెయ్యి. క్లాస్‌కు వెళ్లాల్సిందే' అనేది. ఎక్కడ పోటీలున్నా వెంటబెట్టుకుని తీసుకువెళ్లేది. నేను సంగీతం నేర్చుకోవడానికి ఏంకావాలన్నా చేసేది. పెళ్లయ్యాక మావారు, అత్తగారు కూడా అంతే ప్రోత్సహించారు. అమ్మ ప్రేరణ, అత్తింటివారి సహకారంవల్లే ఇదంతా సాధ్యమైంది.

తాతగారి కోసం రాస్తే...

'ముత్యాలముగ్గు'లో రావుగోపాలరావు గారు పోషించిన పాత్రను వాస్తవానికి బాపూ గారు తాతయ్య కోసం రాసుకున్నారు. ఎంత అడిగినా 'నేను చేయాలనుకోవడంలేదు' అని తాత చెప్పేశారు. సినిమాలు వదిలేసినప్పుడు చెన్నైలో ఆస్తులన్నీ అమ్మేసుకుని ఇక్కడ చిన్న ఇల్లు కొనుక్కుని స్థిరపడ్డారు. ఆ నిర్ణయం ఎందుకు తీసుకున్నారో ఇప్పటికీ ఆయన పిల్లలు ఎవరికీ తెలియదు. ప్రస్తుతం మాకు పరిశ్రమలో ఎవరితో సంబంధాలు లేవు. అయితే జూనియర్ ఎన్టీఆర్ నాకు కజిన్ అవుతాడు. వాళ్లమ్మ శాలిని గారు, మా అమ్మ కజిన్ సిస్టర్స్. చిన్నప్పుడు తారక్ కూచిపూడి నాట్యానికి నేను గాత్ర సహకారం అందించేదాన్ని. ఇప్పుడు అతను బాగా బిజీ అయిపోయాడు. వాళ్లమ్మకు, మా అమ్మకు ఇప్పటికీ ఎంతో సాన్నిహిత్యం ఉంది. అలాగే బాలు గారితో మా నాన్నకు మంచి స్నేహం. ఇద్దరూ చెన్నైలో పక్క ఇళ్లల్లో ఉండేవారు.



కాలేయాన్ని కాపాడుకుందాం!

కాలేయం మన శరీరంలో అత్యంత ముఖ్యమైన అవయవం. శరీరంలో చేరిన విష పదార్థాలను, ఇతర వ్యర్థాలను తొలగించడంలో ప్రధాన పాత్ర పోషిస్తుంది. ఏదైనా సమస్య వచ్చినపుడు కాలేయం తనంతట తాను మరమ్మతు చేసుకుంటుంది. మనం తీసుకునే కొన్ని ఆహార పదార్థాలు కూడా ఇందుకు సహకరిస్తాయి. వాటి గురించి తెలుసుకుందాం.

వెల్లుల్లి

• ఇందులో సల్ఫర్‌తోపాటు అల్లిసిన్, సిలీనియం లాంటి రసాయన సమ్మేళనాలు ఉంటాయి. శరీరంలోని వ్యర్థాలను బయటికి పంపేందుకు కాలేయంలో ఉత్పత్తయ్యే ఎంజైముల తయారీకి ఇవి తోడ్పడతాయి. వెల్లుల్లిని ఆహార పదార్థాల్లో చేర్చుకోవడం ద్వారా కాలేయం పనితీరు మెరుగుపడుతుంది.

బీట్‌రూట్

• తరచూ బీట్‌రూట్ రసం తీసుకోవడం వల్ల అందులోని బీటాలైన్ సమ్మేళనాలు కాలేయంలోని ఇన్‌ఫ్లమేషన్‌ను తగ్గిస్తాయి. బీట్‌రూట్‌లో ఉండే పలు నైట్రేట్‌లు కాలేయంలో వ్యర్థాలు పేరుకోకుండా చేస్తాయి.

గ్రీన్ టీ

• తరచూ గ్రీన్ టీ తాగడం వల్ల కాలేయంలో ఎంజైమ్‌ల ఉత్పత్తి నియంత్రణలో ఉంటుంది. గ్రీన్ టీలోని యాంటీ ఆక్సిడెంట్లు కాలేయంలోని వ్యర్థాలను కరిగించి మూత్రం ద్వారా బయటికి వెళ్లేలా చేస్తాయి.

ఆకు కూరలు


• ఆకు కూరల్లో క్లోరోఫిల్ అధికంగా ఉంటుంది. ఇది రక్తంలో చేరిన భార ఖనిజాలు, పురుగు మందుల అవశేషాలు, ఇతర రసాయనాలను తొలగించడంలో కాలేయానికి సహాయం చేస్తుంది. ఆకుకూరలు, ముదురు ఆకుపచ్చ రంగులో ఉండే కూరగాయలను తరచూ తినడం వల్ల కాలేయంపై పని భారం తగ్గుతుంది.

ఆలివ్ ఆయిల్

• దీనిలో ఆరోగ్యకరమైన కొవ్వు పదార్థాలు ఉంటాయి. ఇవి శరీరంలో చేరిన కొన్ని రకాల విష పదార్థాలను శోషించుకుంటాయి. ప్రతిరోజూ తినే ఆహార పదార్థాల్లో ఆలివ్ ఆయిల్‌ను చేర్చుకోవడం వల్ల కాలేయంపై పని ఒత్తిడి తగ్గుతుంది.

ధనియాలు

• ఒక గ్లాసు నీటిలో ఒక చెంచా ధనియాలు వేసి రాత్రంతా నానబెట్టి ఉదయాన్నే పరగడుపున తాగితే కాలేయంలో వ్యర్థాలు మిగలకుండా ఉంటాయి.



ధనియాల్లో ఉండే పీచు పదార్థాలు, ఫోలిక్ యాసిడ్‌లు ప్రభావవంతంగా పనిచేసి కాలేయాన్ని శుభ్రపరుస్తాయి.

వాల్‌నట్స్

• వీటిలో ఒమేగా 6, ఒమేగా 3 ఫాటీ యాసిడ్లు అధికంగా ఉంటాయి. ఇవి కాలేయంలో కొవ్వులు పేరుకోకుండా చేస్తాయి. వాల్‌నట్స్ తినడం వల్ల వాటిలోని అర్జినైన్ అనే అమైనో ఆమ్లం శరీరం నుంచి అమ్మోనియాను తొలగించడంలో కాలేయానికి సహకరిస్తుంది.

బాదం

• బాదం పప్పులో ఇ విటమిన్ ఉంటుంది. ఇది కాలేయంలోని ఆక్సీకరణ ఒత్తిడితో పోరాడుతుంది. కాలేయం ఆరోగ్యంగా ఉండాలంటే ప్రతిరోజూ కనీసం అయిదు బాదం పప్పులను నీటిలో నానబెట్టి తినాలి.

పండ్లు

• నిమ్మ, నారింజ, బత్తాయి లాంటి సిట్రస్ పండ్లను తరచూ తినడం వల్ల శరీరానికి పుష్కలంగా సి విటమిన్ అందుతుంది. ఇది శరీరంలో చేరిన వ్యర్థాలను పూర్తిగా తొలగించి కాలేయానికి విశ్రాంతిని ఇస్తుంది. యాపిల్ పండ్లను తినడం వల్ల వాటిలో ఉండే పెక్టిన్ అనే పీచు పదార్థం కాలేయాన్ని పూర్తిగా శుభ్రం చేస్తుంది. నల్ల ద్రాక్షను జ్యూస్‌లా చేసుకుని తాగితే అందులోని యాంటీ ఆక్సిడెంట్లు కాలేయంలో ఇన్‌ఫ్లమేషన్‌ని తగ్గిస్తాయి.

నవ్య | చిత్రజ్యోతి


ఈ సినిమా ఆ లోటు తీరుస్తుంది

- మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు



అమర గాయకుడు ఘంటసాల వెంకటేశ్వరరావు జీవితం ఆధారంగా తెరకెక్కుతోన్న చిత్రం 'ఘంటసాల ది గ్రేట్'. కృష్ణ చైతన్య టైటిల్ రోల్ పోషిస్తున్నారు. సిహెచ్. రామారావు దర్శకత్వంలో సిహెచ్.ఫణి నిర్మించారు. తాజాగా, ఈ సినిమా రిలీజ్ డేట్ పోస్టర్‌ను మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు ఆవిష్కరించారు. వచ్చే ఏడాది ఫిబ్రవరి 14న ఈ చిత్రం విడుదల కానుంది. ఈ సందర్భంగా వెంకయ్యనాయుడు మాట్లాడుతూ "ఈతరం ఘంటసాల గురించి తెలుసుకోవాల్సిన అవసరం ఎంతో ఉంది. అందరూ ఆయన్ని శతాబ్ది గాయకుడు అంటారు. నేను ఆయన్ని అమర గాయకుడు అంటాను. సంగీతం ఉన్నంత కాలం ఆయన ప్రజల మనసుల్లో ఉంటారు. కృషితో నాస్తి దుర్భిక్షం, వినయంతో విద్య ప్రకాశిస్తుందని చెప్పడానికి నిలువెత్తు నిదర్శనం ఆయన. దేశంలో ఇప్పటివరకూ ఏ గాయకుడి మీద పూర్తి స్థాయి సినిమా రాలేదు. ఈ సినిమా ఆ లోటును తీరుస్తుంది" అని అన్నారు.

మార్చిలో మొదలు




మేర్లపాక గాంధీ దర్శకత్వంలో వరుణ్‌తేజ్ కథానాయకుడిగా ఓ చిత్రాన్ని ప్రకటించిన విషయం తెలిసిందే. యువీ క్రియేషన్స్, ఫస్ట్‌ఫ్రేమ్ ఎంటర్‌టైన్‌మెంట్స్ భారీస్థాయిలో నిర్మిస్తున్నాయి. ఈ సినిమా షూటింగ్‌పై ఆదివారం మేకర్స్ నుంచి అప్డేట్ వచ్చింది. 'మేర్లపాక గాంధీ అద్భుతమైన స్క్రిప్ట్‌ను సిద్ధం చేశారు, వరుణ్ తేజ్ పాత్ర సరికొత్తగా ఉండబోతోంది. ప్రేక్షకులను ఆకట్టుకునే అన్ని అంశాలతో ఈ చిత్రం రూపుదిద్దుకుంటోంది. ప్రస్తుతం ప్రీ ప్రొడక్షన్ జరుగుతోంది, వచ్చే ఏడాది మార్చిలో చిత్రీకరణ ప్రారంభిస్తామ'ని తెలిపారు.

తుదిదశలో చిత్రీకరణ



ప్రభాస్ కథానాయకుడిగా మారుతి రూపొందిస్తున్న హారర్ థ్రిల్లర్ 'రాజా సాబ్'. ప్రస్తుతం చిత్రీకరణ జరుగుతోంది. మాళవికా మోహనన్ కథానాయికగా నటిస్తున్నారు. ఓ ఇంటర్వ్యూలో మాళవిక 'రాజాసాబ్' షూటింగ్ గురించి ఆసక్తికర అంశాలను పంచుకున్నారు. "రాజాసాబ్' షూటింగ్ తుది దశకు చేరుకుంది. మంచి ప్లానింగ్‌తో మారుతి షూటింగ్ కొనసాగిస్తున్నారు. ఆయన త్వరలోనే ఆశ్చర్యపోయే అప్‌డేట్ ఇవ్వబోతున్నారు' అన్నారు. వచ్చే ఏడాది ఏప్రిల్ 10న ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది. టీజీ విశ్వప్రసాద్, వివేక్ కూచిబొట్ల నిర్మిస్తున్న ఈ చిత్రానికి తమన్ సంగీతం అందిస్తున్నారు.

అద్భుత ప్రయాణం ముగిసింది



మలయాళ కథానాయకుడు మోహన్‌లాల్, పృథ్వీరాజ్ సుకుమారన్ దర్శకత్వంలో నటిస్తున్న చిత్రం 'లూసిఫర్ 2: ఎంపురన్'. 2019లో విడుదలై ఘనవిజయం సాధించిన 'లూసిఫర్' సినిమాకు ఇది కొనసాగింపు. లైకా ప్రొడక్షన్స్ నిర్మిస్తోంది. తాజాగా, ఈ సినిమా షూట్ పూర్తైనట్లు మోహన్‌లాల్ ఇన్‌స్టాగ్రామ్ ద్వారా తెలిపారు. "లూసిఫర్ సినిమా షూట్ పూర్తైంది. 14 నెలలుగా ఎనిమిది రాష్ట్రాలు.. యూఎస్ఏ.. యూకే.. యూఏఈలోని అద్భుతమైన లొకేషన్లలో చిత్రీకరించాం. అద్భుత ప్రయాణమిది. ప్రతి ఫ్రేమ్‌ని తన సృజనాత్మకతతో మరో స్థాయికి తీసుకెళ్లే అపార ప్రతిభ పృథ్వీరాజ్ సొంతం. తన కలం పదునుతో సినిమాకు ఎంతో ప్రత్యేకతను తెచ్చిన మురళీ గోపికి.. ఈ ప్రాజెక్ట్‌పై ఎంతో నమ్మకం పెట్టిన నిర్మాతలకు ధన్యవాదాలు. టీమ్ సమష్టి కృషి వల్లే ఈ సినిమా సాధ్యమైంది. నా సినీ ప్రయాణంలో ఈ సినిమా ఓ మైలురాయి. అభిమానులు అందించే ప్రేమే మాలో స్ఫూర్తిని పెంచింది" అని పేర్కొన్నారు. వచ్చే ఏడాది మార్చి 27న ఈ సినిమా విడుదలవుతోంది.

ఎక్స్ ఖాతా డిలీట్



నెట్‌ఫ్లిక్స్‌లో స్ట్రీమ్ అవుతోన్న 'నయనతార: బియాండ్ ద ఫేరీ టేల్' డాక్యుమెంటరీ విషయంలో ధనుష్, నయనతార మధ్య మొదలైన వివాదం తెలిసిందే. 'నానుమ్ రౌడీ దాన్' సినిమాలోని కొన్ని సెకన్ల ఫుటేజిని వాడారని.. అందుకోసం ధనుష్.. నయనతార, విఘ్నేష్ శివన్ కోర్టు నోటీసులు పంపారు. అయితే, ఇటీవలే 'నానుమ్ రౌడీ దాన్' సినిమాలోని క్లిప్ ఉచితంగా చూసేయ్యండి అనే వీడియోతో పాటు ధనుష్ ఓ మీడియా ఈవెంట్‌లో మాట్లాడిన వీడియోనూ ఇన్‌స్టా స్టోరీలో పోస్ట్ చేశారు విఘ్నేష్. ధనుష్ అభిమానుల నుంచి ట్రోలింగ్ జరిగేసరికి ధనుష్ వీడియోను తొలగించారు. తాజాగా, తాను అజిత్ నటించిన 'ఎన్నై అరిందాల్' (ఎంతవాడు కానీ) సినిమా కోసం ఓ పాట రాశాననీ.. అదే టైమ్‌లో తన మొదటి మూవీ 'నానుమ్ రౌడీ దాన్'ని చూసి ఆయన మెచ్చుకున్నారని తెలిపారు. ఇవన్నీ అబద్ధాలంటూ.. అజిత్ సినిమా రిలీజైన ఏడు నెలలకు 'నానుమ్ రౌడీ దాన్' విడుదలైందని.. అసలు థియేటర్లలోకి సినిమా రాకముందే అజిత్ ఎలా చూశారని ధనుష్ అభిమానులు విఘ్నేష్‌ను ట్రోల్ చేశారు. దీంతో విఘ్నేష్ శివన్ తన ఎక్స్ ఖాతాను డిలీట్ చేశారు.

మహేశ్‌బాబు ఎంజాయ్ చేశారు



2019లో వచ్చిన 'ది లయన్ కింగ్' చిత్రానికి కొనసాగింపుగా వస్తున్న చిత్రం 'ముఫాసా: ది లయన్ కింగ్'. బారీ జెన్‌కిన్స్ దర్శకత్వం వహించారు. వాల్ట్ డిస్నీ పిక్చర్స్ నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 20న విడుదలవుతోంది. ఈ చిత్రం తెలుగు వెర్షన్‌లో ముఫాసా పాత్రకు హీరో మహేశ్‌బాబు డబ్బింగ్ చెప్పారు. ఆదివారం చిత్రబృందం నిర్వహించిన ప్రచార కార్యక్రమంలో ముఫాసా, మహేశ్‌బాబు ప్రచార చిత్రాన్ని నమ్రతా శిరోద్కర్ ఘట్టమనేని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 'డిస్నీ సంస్థ ప్రతిష్ఠాత్మకంగా నిర్మించిన చిత్రమిది. ఇలాంటి మంచి సినిమాను ఔచిత్యం చెడకుండా డబ్ చేయడం ఓ సవాల్ అనే చెప్పాలి. డిస్నీ సంస్థ చాలా శ్రమించి ఈ చిత్రాన్ని తెలుగు ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తోంది. చాలా ఎంజాయ్ చేస్తూ 'ముఫాసా' పాత్రకు మహేశ్‌బాబు డబ్బింగ్ చెప్పారు. ఈ చిత్రం తప్పకుండా తెలుగు ప్రేక్షకులకు నచ్చుతుంది' అన్నారు. ఈ సందర్భంగా ముఫాసా చిత్రబృందం రూపొందించిన మహేశ్‌బాబు పోస్టర్‌ను నమ్రత ఆవిష్కరించారు. సత్యదేవ్, అలీ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

గుంటూరు రూరల్ వార్తలు

◆ మంగళగిరి ◆ తాడికొండ ◆ ప్రత్తిపాడు

పశ్చిమ డెల్టాకాల్వకు 2120 క్యూసెక్కుల నీరు

దుగ్గిరాల, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ప్రకాశం బ్యారేజి నుంచి పశ్చిమ డెల్టా కాల్వకు 2120 క్యూసెక్కుల సాగునీటిని ఆదివారం విడుదల చేసినట్లు నీటి పారుదలశాఖ అధికారులు తెలిపారు. బ్యారేజి వద్ద 12.0 అడుగుల నీటిమట్టం ఉంది. దుగ్గిరాల సబ్‌డివిజన్ నుంచి రేపల్లెకాల్వకు 244, తూర్పు కాల్వకు 44, పశ్చిమ కాల్వకు 57, నిజాంపట్నంకాల్వకు 188, కొమ్మమూరు కాల్వకు 1179 క్యూసెక్కుల నీరు, విడుదల చేస్తున్నారు.

మహిళలపై హింసను అరికట్టాలి



విద్యార్థినులకు అవగాహన కల్పిస్తున్న శ్రీదేవి వెల్లంకి

తాడేపల్లి, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): మహిళలపై హింసను అరికట్టాలని, దానిని నిర్మూలించడం అందరి బాధ్యత అని శ్రీదేవి వెల్లంకి అన్నారు. శనివారం రాత్రి తాడేపల్లి మండలం పెనుమాక జడ్పీ హైస్కూల్లో రోటరీ క్లబ్ ఆఫ్ తాడేపల్లి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ చిన్నారులు, బాలికలపై హింసను అరికట్టాలని, వ్యాఖ్యానించారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ ఆఫ్ తాడేపల్లి అధ్యక్షుడు రావూరి రమేష్‌బాబు, సుకుమార్‌రెడ్డి, సభ్యులు పాల్గొన్నారు.

అదానీని అరెస్టు చేయాలి : సీపీఎం



పాతబస్టాండు సెంటర్లో నిరసన వ్యక్తం చేస్తున్న సీపీఎం నేతలు

మంగళగిరి సిటీ, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): అవినీతి పరుడైన అదానీని అరెస్టు చేయాలని డిమాండ్ చేస్తూ సీపీఎం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం మంగళగిరి పాతబస్టాండు సెంటర్లో నిరసన వ్యక్తం చేశారు. సీపీఎం జిల్లా కార్యదర్శి పాశం రామారావు మాట్లాడుతూ సోలార్ విద్యుత్ ఒప్పందంలో అదానీ నుంచి 2,029 కోట్ల ముడుపులు ప్రజాప్రతినిధులు, అధికారులకు అందినట్టు అమెరికాలో కేసు నమోదైందన్నారు. ఈ వ్యవహారంపై ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు నోరు మెదపడం లేదని విమర్శించారు. సెకీ కంపెనీతో కుదుర్చుకున్న ఒప్పందాలన్నీ రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం నేతలు ఈమని అప్పారావు, ఎం రవి, చెంగయ్య, రాఘవులు, బాలాజీ, ఎం చలపతిరావు, గణేష్, టీ శ్రీరాములు, ఎం నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కార్తీకమాసంలో దీపారాధన..

యోగా సాధనకు గుర్తు



భగవద్గీతను ప్రచారం చేస్తున్న కమిటీ సభ్యులు

తాడికొండ, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): కార్తీక మాసంలో చేసే దీపారాధన యోగా సాధనకు గుర్తు అని గుంటూరు కమిటీ అధ్యక్షుడు రౌతు శ్రీనివాసరావు తెలిపారు. కార్తీక మాసం చివరి రోజును పురస్కరించుకొని త్రైతా సిద్ధాంతం ప్రబోధ సేవాసమితి. ఇందూ జ్ఞానవేదిక గుంటూరు కమిటీ సభ్యుల ఆధ్వ ర్యంలో రావెలలో త్రైతా సిద్ధాంత భగవద్గీత ప్రచారం చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ కార్తీక మాసంలో దీపాలు, వెలిగించడం అందులోని జ్ఞానం ప్రతిఒక్కరూ తెలుసు కోవాలన్నారు. కార్యక్రమంలో త్రైతా సిద్ధాంతం ప్రబోధ సమితి, ఇందూ జ్ఞాన వేదిక సభ్యులు టీవీ కృష్ణారావు, బీ శివలింగంనాయక్, ఆర్ రామకృష్ణ, టీ బ్రహ్మం, పీ పట్టాబి, శ్రీను, సుధాకర్, హరిబాబు, రామోజీనాయక్, సుబ్బారావు, గోపి, దిల్‌షా, విద్య, జయలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

పుట్టతోటలో కార్తీక అమావాస్య పూజలు



నాగేంద్రస్వామికి పూజలు చేస్తున్న భక్తులు

మంగళగిరి, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): నవులూరు శ్రీనాగేంద్రస్వామి పుట్ట వద్ద కార్తీక అమావాస్య పర్వదినాన్ని పురస్కరించుకుని ఆదివారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళలు పుట్టలో పాలు పోసి ఆవరణలోని నవ నాగేంద్రులు, 23 నాగేంద్రస్వామి పీఠాల వద్ద విగ్రహాలకు పాలాభిషేకం చేశారు. నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. కార్తీక మాసం ఆఖరి రోజు కావడంతో దేవాలయం భక్తులతో కిటకిటలాడింది.

ప్రమాదవశాత్తు

చెరువులో పడి వ్యక్తి మృతి

తుళ్లూరు, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): చెరువులో పడి వ్యక్తి మృతి చెందిన ఘటన ఆదివారం మధ్యాహ్నం మండలపరిధిలోని పెదపరిమిలో జరిగింది. అత్తోట మధుబాబు (46) గేదెలను అదిలించటం కోసం చెరువులోకి అడుగేశాడు. అక్కడ గతంలో మట్టి తీసి ఉండటంతో లోతు ఎక్కువగా ఉంది. అదీగాక ఊబిగా ఉండటంతో పైకి రాలేకపోయాడు. కొంత సేపటి తరువాత స్థానికులు మధుబాబు మృతదేహన్ని గుర్తించి పోలీసుల కు సమాచారం ఇచ్చారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ గంగా వెంకటేశ్వర్లు తెలిపారు మృతుడికి భార్య, కుమార్తె, ఇద్దరు కుమారులున్నారు.

ఏడుగురు జూదరుల అరెస్టు

తుళ్లూరు, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): మండలపరిధిలోని వడ్డమాను గ్రామ చింతలతోపులో పేకాట ఆడుతున్న ఏడుగురిని ఆదివారం తుళ్లూరు పోలీసులు అరెస్టు చేశారు. వారి నుంచి రూ.3.420 నగదును స్వాధీనం చేసుకున్నట్టు తుళ్లూరు ఎస్ఐ అంకమ్మ తెలిపారు.

కొద్దిపాటి గాలులకే నేలవాలిన వేలాది ఎకరాల పైరు

● యంత్రాలకు పెరిగిన డిమాండ్‌తో రెండింతలౌతున్న ఖర్చులు

● పూర్తిగా ఆరకముందే ధాన్యాన్ని అమ్ముకొంటున్న రైతులు



కొద్దిపాటి గాలులు, వర్షానికే నేలకొరిగిన తడిసిన వరిపైరు

దుగ్గిరాల, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఫెంగల్ తుపాన్ ప్రభావంతో వీచిన కొద్దిపాటి గాలులకే మండలంలో పలుచోట్ల పంట నేలకొరిగింది. శనివారం రాత్రి కురిసిన కొద్దిపాటి వర్షంతో హమ్మయ్య గండం గట్టెక్కిందని అనుకున్న రైతులు, ఆదివారం సాయంత్రం మరలా వర్షం కొనసాగుతుండటంతో తీవ్ర ఆందోళన చెందుతున్నారు. వర్షంతో బరువెక్కిన వరిపంట నేలకొరిగి తడిసి పోవడంతో ఒకవైపు గింజ రాలిపో తుందేమోనన్న భయం నెలకొంది. అవసరమైన మేరకు మండలంలో పలుగ్రామాల్లో వరికోతలు పూర్తి కాక పోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. వేలాది ఎకరాల్లో పంట నేటికీ కోతకోయకుండా పొలాల్లోనే ఉండిపోయింది. కూలీలతో కోయిద్దామంటే వర్షం వస్తే ఓదెలు వేసిన ప్రయోజనం ఉండదనే అంశం రైతులను ఆలోచనలో పడవేస్తోంది. నేలకు ఒరిగిన పంట ఒకవైపు నిద్రలేకుండా చేస్తుండగా మరోవైపు హడావిడిగా కోత కోయిద్దామంటే కూలీలతో కోతఖర్చుకంటే ప్రస్తుతమున్న పరిస్థితుల్లో యంత్రాలతో కోతఖర్చు రెట్టింపు అవుతోందని వాపోతున్నారు. ధాన్యాన్ని పూర్తిగా ఆరబెట్టకముందే ఇంటికి తరలిద్దామంటే గతంలో మాదిరిగా ఏరైతు ఇంటి వద్ద ధాన్యం పురులు లేవు. అనేక మంది రైతులు పొలా ల సమీపంలో రోడ్ల పైనే ఆరబెట్టుకుంటున్నారు.

దళారులకు తెగనమ్ము కుంటున్న రైతులు

ధాన్యం బస్తా రూ.1720 నుంచి రూ.1740 వరకూ కొనుగోలు చేస్తామని ప్రభుత్వం చెబుతున్నప్పటికీ తేమశాతం 17శాతం మించకూడదనే నిబంధనతో రైతులు వెనకడుగు వేస్తున్నారు. దళారులు ఇదే అదనుగా చేసుకుని బస్తా రూ.1400 మించి కొనలేమంటున్నా, రెండో పంట వేసుకునేందుకు నగదు అవసరమైన రైతులు వారికి విక్రయించేందుకే మొగ్గు చూపుతున్నారు. అధికారులు రైతులకు ఎన్ని విధాలుగా సర్దిచెబుతున్నప్పటికీ, పంట నమోదు చేయించుకోని రైతుల వద్ద ధాన్యం కొనుగోలు చేయమని నిబంధనలు చెబుతుండటం దళారుల పాలిట వరంగా మారింది.

విత్తన ఎంపిక సరిగా లేకనే..

వేర్లు బలంగా నిలబడే వరిరకం విత్తనాలు అందుబాటులో లేకపోవడంతో గత్యంతరం లేక మార్కెట్‌లో అందుబాటులో ఉన్న విత్తనాలనే రైతులు వినియోగిస్తున్నారు. భవిష్యత్తులో నాసిరకం విత్తనాలు మార్కెట్‌లోకి రాకుండా చూడాలని, అదే సమయంలో గాలులను తట్టుకుని పంటకోసే వరకూ నిలబడే అధికదిగుబడినిచ్చే రకాలు అందుబాటులోకి తేవాలని రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు.

ధరలు పెంచిన యంత్రాల బ్రోకర్లు

యంత్రాలతో వరికోతలు చేయక తప్పని పరిస్థితుల్లో, కోతలు జరిపించే బ్రోకర్లు ధరలు పెంచి అన్నదాతలకు చుక్కలు చూపిస్తున్నారు. గతంలో ఎకరాకు గంట సమయం వరకూ పట్టేదని, అందుకుగానూ రూ.2500 ధర మించేదికాదని, ఈఏడాది గంటకు రూ.3వేలు చొప్పున వసూలు చేస్తున్నారని రైతులు చెబుతున్నారు. కాగా నేలకొరిగిన పంటకు ఎకరాకు రెండున్నర గంటల నుంచి 3గంటల వరకూ పడుతోందని, తద్వారా ఎకరాకు రూ.7.5 వేల నుంచి రూ.9 వేల వరకూ ఖర్చవుతోందంటున్నారు. ఇతర ప్రాంతాల నుంచి వరికోత యంత్రాలను తీసుకువచ్చైనా తుఫాన్ ప్రభావిత ప్రాంత రైతులను ఆదుకోవాలని కొందరు రైతులు కోరుతున్నారు. మొత్తం మీద తుఫాన్ భయం పోయే వరకూ కునుకు తీసే పరిస్థితి లేకుండా పోయిందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

వ్యవసాయ సాగులో విత్తన శుద్ధి ముఖ్యం

బాపట్ల వ్యవసాయ కళాశాల ప్రొఫెసర్ రమాదేవి



విత్తన శుద్ధిని పరిశీలిస్తున్న ప్రొఫెసర్ రమాదేవి, విద్యార్థినులు, రైతులు

వట్టిచెరుకూరు, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయసాగులో విత్తన శుద్ధి ముఖ్యమని, విత్తనాలు శుద్ధి చేసుకోవటం ద్వారా ఆయా పంటల్లో తొలి దశలో వచ్చే వివిధ రకాల తెగుళ్ళను నివారించుకోవచ్చని బాపట్ల వ్యవసాయ కళాశాల ప్రొఫెసర్ ఎం రమాదేవి రైతులకు సూచించారు. బాపట్ల వ్యవసాయ కళాశాలకు చెందిన విద్యార్థినులు గ్రామీణ వ్యవసాయ కళాశాల కృషి అనుభవ పథకంలో భాగంగా వట్టిచెరుకూరు, లేమల్లెపాడు, అనంతవరప్పాడు గ్రామాల్లో ఉంటున్న విద్యార్థులు నిత్యం వారి కార్యకలాపాలు, రైతులతో మమేకమవుతున్న కార్యక్రమాల రికార్డులను డాక్టర్ రమాదేవి నిశితంగా పరిశీలించారు. ఈ సంద ర్భంగా రైతులతో మాట్లాడారు.



మందు పిచికారి చేస్తున్న విద్యార్థిని

మండలంలో లేమల్లెపాడు గ్రామంలో డాక్టర్ రమాదేవి రైతుల సమక్షంలో విద్యార్థినులు విత్తనశుద్ధి చేసే విధానాన్ని రైతులకు వివరించారు. శనగ విత్తనాలు పొలంలో విత్తుకునే ముందు విత్తన శుద్ధి చేసుకోవటం ద్వారా తొలిదశలో వచ్చే ఎండు తెగులు నివారించుకోవచ్చని, అలాగే పంట తొలి దశలో ఉండగా వేప గింజల కషాయాన్ని పిచికారి చేసుకోవటం ద్వారా పురుగు గుడ్ల ఉత్పత్తిని అరికట్టవచ్చని ఆమె సూచించారు.

స్ప్రేయర్‌తో మందు పిచికారి చేసిన విద్యార్థినులు

మండలంలో లేమల్లెపాడులో కృషి అనుభవ కార్యక్రమంలో భాగంగా నివశి స్తున్న విద్యార్థినులు గ్రామానికి చెందిన దొప్పలపూడి రంగారావు మిరప తోటలో తైవాన్ స్ప్రేయర్ ద్వారా మందు పిచికారి చేయటాన్ని డాక్టర్ రమాదేవి, రైతులు ఆసక్తిగా తిలకించారు.

ప్రజాసమస్యలపై పోరాటాలను ఉధృతం చేయాలి

● సీపీఎం జిల్లా కార్యదర్శి పాశం రామారావు



మహాసభలో ప్రసంగిస్తున్న సీపీఎం జిల్లా కార్యదర్శి రామారావు

మంగళగిరి సిటీ, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ప్రజాసమస్యలపై ఉద్యమాలు, పోరాటాలను ఉధృతం చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి పాశం రామారావు పిలుపునిచ్చారు. సీపీఎం మంగళగిరి పట్టణ 24వ మహాసభ ఆదివారం నిర్వ హించారు. రామారావు మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం మూడోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత సామన్యులపై పెనుభారాలను మోపుతుందని విమర్శించారు. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో మహిళలపై అత్యాచారాలు, దాడులు పెరిగిపోతున్నాయని చెప్పారు. ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటుపరం చేయడంతో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు రోజురోజుకు తగ్గిపోతున్నాయన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయడంలేదని తెలిపారు. అమరావతికి అప్పు పేరుతో రూ.15 వేల కోట్లను వివిధ సంస్థల ద్వారా కేంద్రం ఇప్పించడం దారుణమన్నారు. గ్రాంటుగా ఇవ్వవలసింది పోయి అప్పుగా ఇప్పించడం ఏమిటని ప్రశ్నించారు. మంగళగిరి నియోజకవర్గంలో ఇళ్ల స్థలాలు లేని పేదలకు నివేశన స్థలాలు మంజూరు చేయాలని కోరారు. ఈ మహాసభలో సీపీఎం నేతలు వై నేతాజీ, ఈమని అప్పారావు, ఎం రవి, వీ జవహర్‌లాల్, పీ బాలకృష్ణ, జే బ్రాహ్మణి, రాఘవులు, చెంగయ్య, ఈ కాటమ రాజు తదితరులు పాల్గొన్నారు.

సీపీఎం పట్టణ కార్యదర్శిగా జవహర్‌లాల్

సీపీఎం మంగళగిరి పట్టణ మహాసభ సందర్భంగా పట్టణ నూతన కార్యదర్శిగా వీసం జవహర్‌లాల్‌ను ఎన్నుకున్నారు. కార్యదర్శివర్గ సభ్యులుగా చెంగయ్య, కమలాకర్, బాలాజీ, గణేష్, చలపతిరావు, శ్రీరాములు, టీ శ్రీనివాసరావు, కే శ్రీనివాసరావు, ఆర్ వేణు, ఎం శివచంద్రరావు, జే బ్రాహ్మణిలను ఎన్నుకున్నట్టు ప్రకటించారు. పట్టణంలోని వివిధ రకాల భూముల్లో నివసిస్తున్న పేదలకు ఇళ్ల పట్టాలు ఇవ్వాలని, పేదలకు ప్రభుత్వమే స్థలం కేటాయించి ఇళ్ల కట్టించి ఇవ్వాలని, టిడ్కో సముదాయాన్ని ముంపు నుంచి కాపాడేందుకు చర్యలు తీసుకోవాలని, చేనేతకు బడ్జెట్‌లో రూ.2 వేల కోట్లు కేటాయించాలని, నేతన్న నేస్తం కార్మికులందరికీ అమలుచేయాలని డిమాండ్ చేస్తూ మహాసభలో తీర్మానాలను ఆమోదించారు.

భూములను దోస్తున్న స్వామీజీలపై చర్యలు తీసుకోవాలి

● భారత హేతువాదుల సంఘం అధ్యక్షుడు నార్నే వెంకట సుబ్బయ్య



ప్రసంగిస్తున్న భారత హేతువాదుల సంఘం అధ్యక్షుడు నార్నే వెంకట సుబ్బయ్య

తాడేపల్లి టౌన్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): భూములను దోస్తున్న స్వామిజీలపై చర్యలు తీసుకోవాలని భారత హేతువాదుల సంఘం అధ్యక్షుడు నార్నే వెంకట సుబ్బయ్య అన్నారు. ఆదివారం తాడేపల్లి ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ రాజకీయ నాయకులు సైతం స్వామిజీల వద్ద మోకరిల్లడం దారుణమని చెప్పారు. నెల్లూరులో రామదూత అనే స్వామి 25 ఏళ్ల నుంచి భూములు ఆక్రమిస్తూ స్వాహా చేస్తున్నారని ఆరోపించారు. అప్పటి ప్రిన్సిపల్ సెక్రటరీకి ఫిర్యాదు చేయగా భూములు స్వాధీనం చేసుకొమ్మని అధికారులు ఆదేశాలు ఇచ్చినప్పటికీ అమలు కాలేదన్నారు. గతంలో జగన్ సీఎం గా ఉన్నప్పు డు స్వరూపానంద స్వామి జగన్‌ను మాయ చేసి భూ ములు దోచుకున్నారని విమర్శించారు. ఇప్పుడు రామ దూత కూడా చంద్రబాబును మాయచేసి భూములను కాజేయాలని చూస్తున్నారని, స్వామిజీ ఆక్రమించిన భూ ములను స్వాధీనం చేసుకోవాలని అప్పటి కలెక్టర్ ఎంఆర్ వోలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. స్వామీ జీల భూఆక్రమణలు ఎక్కడైనా సరే మాదృష్టికి తెస్తే అడ్డుకుంటామని చెప్పారు. కార్యక్రమంలో నేతలు యర్రంశెట్టి జగన్‌మోహనరావు, లక్ష్మీనారాయణ, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

రేపు ముట్లూరు పునీత శౌరివారి తిరునాళ్ళ ప్రారంభం



విద్యుత్ కాంతులతో పునీత శౌరివారి దేవాలయం

వట్టిచెరుకూరు, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ముట్లూరు గ్రామంలో ప్రసిద్ధి చెంది కుల, మతాలకు అతీతంగా ఆరాధించుకొనే పునీతశౌరి వారి తిరునాళ్ళ ప్రధాన ఘట్టం 3వ తేదీన జరగనున్న నేపథ్యంలో దేవాలయ ఫాదర్ దిలీప్‌కుమార్, పలు దేవాలయాల నుంచి వస్తున్న ఫాదర్లు దేవాలయ ప్రాంగణంలో భక్తులకు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నట్టు వెల్లడించారు. 3వ తేదీ ఉదయం దివ్యబలి, 10 గంటలకు గుంటూరు పీఠాధిపతి చిన్నాబత్తిని భాగ్యయ్యతో అనేక మంది గురువులతో కలసి మహోత్సవ సమష్టి దివ్యపూజాబలి కార్యక్రమంలో పాల్గొని సందేశం ఇస్తారని, ఇందు కోసం ప్రత్యేక వేదికను సిద్ధం చేస్తున్నట్టు ఆయన చెప్పారు. తిరునాళ్ళకు భారీ సంఖ్యలో భక్తులు తరలివస్తున్న నేపథ్యంలో దేవాలయ ప్రాంగణంలో భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగ కుండా సీఐ రమానాయక్, ఎస్ఐ సుబ్బారావులు ప్రత్యేక బందోబస్తు, నిఘాను ఏర్పాటు చేస్తున్నారు.

పెనుమాకలో వైద్యశిబిరం

తాడేపల్లి, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): తాడేపల్లి మండలం పెనుమాకలో తెలుగురైతు గుంటూరు జిల్లా అధ్యక్షుడు కళ్లం రాజశేఖరరెడ్డి ఆధ్వర్యంలో విజయవాడ లక్ష్మీ ఫౌండేషన్ హాస్పిటల్స్‌చే ఆదివారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో 165 మందికి ఉచితంగా బీపీ, షుగరు, కంటి పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. రాజశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ ఇటువంటి వైద్యశిబిరాలను ప్రజలు వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ కళ్యాణి, ఇమ్రాన్, గురవయ్య రజియా, కళ్లం శివగోవిందరెడ్డి, పలగాని ఆంజనేయులు, లతీష్‌రెడ్డి, నాగేశ్వరరావు, అక్బర్‌ఖాన్, చలపతిరావు, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి సప్తాహ మహోత్సవాలు



కోదండ రామస్వామి మూలవిరాట్‌లు

వట్టిచెరుకూరు, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వింజనంపాడు గ్రామంలో గల శ్రీకోదండ రామస్వామి దేవాలయం 60వ సప్తాహ మహోత్సవాలు నేటి సాయంత్రం గ్రామంలో స్వామి వారి మూలవిరాట్ విగ్రహాల ఊరేగింపుతో ప్రారంభం కానున్నాయి. ఈ మేరకు నిర్వాహకులు విస్తృతంగా ఏర్పాట్లు చేస్తున్నారు. మూడో తేదీ ఉదయం దేవాలయ ప్రాంగణంలో కిడ్స్ కళాశాల చైర్మన్ కోయ సుబ్బారావు దంపతులతో అఖండ దీపారాధన వెలిగించటంతో కార్యక్రమాలు ప్రారంభం కానున్నాయి. ఈనెల 3, 4 తేదీల్లో ప్రత్యేక పూజలు జరగనున్నాయి. 5, 6 తేదీల్లో సాయంత్రం సమయాల్లో ప్రముఖ ఆధ్యాత్మికవేత్త పద్మశ్రీ గరికపాటి నరసింహారావుతో ఆధ్యాత్మిక ప్రవచనాల కార్యక్రమాలు, 7వ తేదీ వైభవంగా సీతారామస్వామి కల్యాణ మహోత్సవం, 8వ తేదీ సీతా సమేత రామచంద్రమూర్తి పుష్పయాగం, 9వ తేదీన కోదండరామ స్వామి ఉత్సవ విగ్రహాలతో స్థానిక చెరువులో తెప్పోత్సవంతో సప్తాహ మహోత్సవాలు ముగుస్తాయని నిర్వాహకులు వివరించారు.

సూర్యఘర్ ద్వారా ఉచిత విద్యుత్



ఫిరంగిపురంలో దివ్య సోలార్ పవర్ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న ఫాదర్ రవీంద్ర

ఫిరంగిపురం, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : ప్రధాన మంత్రి మోదీ సూర్యఘర్ పథకం ద్వారా గృహాలకు ఉచిత విద్యుత్ పథకం అమలు కానున్నదని దివ్య సోలార్ పవర్ సిస్టమ్ ఆర్గనైజర్ పెద్ద కోట్ల జోజప్ప అన్నారు. ఆదివారం ఫిరంగిపురంలోని సత్తెనపల్లి బస్టాప్ సమీపంలో బాగ్యేయ సెల్ ఫోన్ సెంటర్ వద్ద దివ్య సోలార్ పవర్ సిస్టమ్ కార్యాలయాన్ని బాల ఏసు చర్చి ఫాదర్ రవీంద్ర ప్రారంభించిన అనంతరం ప్రభుత్వ రాయితీతో ఇళ్ళపై సోలార్ సిస్టమ్‌ను ఏర్పాటు చేయనున్నామన్నారు. ప్రభుత్వం రూ.70వేలు రాయితీ ఇస్తుందని, మిగిలిన నగదును బ్యాంకులు లోన్‌గా ఇవ్వనున్నాయని గృహాల యజ మానులు ఈ అవకాశాన్ని సద్వినియోగించుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో పీఎల్ మరియన్న, కొమ్మారెడ్డి జోజిరెడ్డి, జోజిబాబు, రాయప్ప, జ్ఞానయ్య, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

జైపూర్ స్టడీ టూర్‌కు నగర కమిషనర్

గుంటూరు కార్పొరేషన్, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు రాజస్థాన్ రాజధాని జైపూర్‌కు స్టడీ టూర్ నిమిత్తం జీఎంసీ కమిషనర్ పులి శ్రీనివాసులు హాజరుకానున్నారు. జైపూర్ మున్సిపల్ కార్పొరేషన్‌లో వీధి దీపాల పర్యవేక్షణ వ్యవస్థ, రోడ్ల నిర్వహణ, సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్, ద్రవ వ్యర్థాల నిర్వహణ, ఇతర ఉత్తమ పద్ధతుల అమలవుతున్న తీరుపై పరిశీలన, అధ్యయనం నిమిత్తం ఈ నెల 2,3 తేదీల్లో ఆయన హాజరుకానున్నారు. 4 నుంచి కమిషనర్ అందుబాటులో ఉంటారు.

రేషన్ బియ్యం కొనుగోలు చేస్తే పీడీ యాక్టు

● అమ్మిన వారి రేషన్ కార్డు రద్దు : ఎమ్మెల్యే శ్రావణ్‌కుమార్

తుళ్లూరు, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): రేషన్ బియ్యం కొనుగోలు చేస్తే పీడీ యాక్టు ప్రకారం శిక్షార్హులని, అమ్మిన వారి కార్డు రద్దు చేస్తామని.. బియ్యం పంపిణీ వాహనాల మీద బ్యానర్ కట్టాలని ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్ ఆదేశించారు. ఈ మేరకు ఆదివారం ఆయన కార్యాలయం నుంచి ప్రకటన విడుదల చేశారు. రేషన్ బియ్యం అక్రమంగా అమ్మకం, కొనుగోలు చేయటాన్ని నిరోధించే చర్యల్లో భాగంగా రేషన్ పంపిణీ వాహనాలన్నిటి మీద రేషన్ కార్డు దారులకు విజ్ఞప్తి అని బ్యానర్లను ఏర్పాటు చేసి అమ్మకం కొనుగోలు జరిగితే కఠిన చర్యలు ఉంటాయని తెలియజేస్తున్నాం. కావున ప్రజలందరూ సహకరించి రేషన్ బియ్యంలో జరుగుతున్న అక్రమాలను అరికట్టాలని ఆ ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. కార్డు దారులు బియ్యం తీసుకోకపోయినా కార్డు రద్దు కాదని, అన్ని సంక్షేమ పథకాలు యధావిధిగా అమలు జరుగుతాయని, అవసరం లేనపుడు రేషన్ బియ్యాన్ని తీసుకోకుండా ప్రభుత్వానికి సహకరించాలని బ్యానర్‌పై రాయాలని సూచించారు. మిగిలిన కంది పప్పు, పంచాదార యధావిధిగా తీసుకోవచ్చని తెలిపారు. రేషన్ బియ్యంపై 46 రూపాయల 20పైసలు ఖర్చును ప్రభుత్వం సబ్సిడీగా భరించి కార్డు దారుల కు అందిస్తున్నదని, బియ్యం అవసరం లేనప్పుడు కార్డుదారులు తీసుకోకుండా ఉండటం వల్ల ప్రభుత్వానికి సబ్సిడీ భారం తగ్గుతుందని, ఇదే విషయం బ్యానర్ మీద ఉండాలని ఆదేశించారు. రేషన్ కార్డు ద్వారా సరఫరా చేయు నిత్యావసర సరుకులు అమ్మకం, కొనుగోలు చేయకూడదని సూచించారు.

తాడేపల్లిలో కార్డెన్ సెర్చ్



కార్డెన్ సెర్చ్‌లో పాల్గొన్న పోలీసు అధికారులు, సిబ్బంది

తాడేపల్లి టౌన్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): తాడేపల్లి పట్టణం ప్రకాష్‌నగర్, నులకపేట ప్రాంతాల్లో ఆదివారం రాత్రి పోలీసులు కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ ఆదేశాల మేరకు లా అండ్ ఆర్డర్ అడిషనల్ ఎస్పీ రవికుమార్ ఆధ్వర్యంలో ఈ సెర్చ్ జరిగింది. సుమారు 100 మంది సిబ్బంది వివిధ ప్రాంతాల్లోని ప్రతి వీధిని జల్లెడపట్టారు. ఈ సందర్భంగా సీఐ కళ్యాణ్ రాజు మాట్లాడుతూ సరియైన ధ్రువీకరణ పత్రాలు, నెంబరు ప్లేటు లేని 38 వాహనాలను సీజ్ చేసినట్టు తెలిపారు. ఎవరైనా అసాంఘిక చర్యలకు పాల్పడినా, గంజాయి, మత్తు పదార్థాలు విక్రయాలు జరిపినా సహించేది లేదని, కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పోలీసు సిబ్బంది 24 గంటలూ అందుబాటులో ఉంటారని అనుమానితులు ఎవరైనా ఉంటే వేంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని తెలిపారు. కార్యక్రమంలో సీఐ వినోద్, ఎస్ఐలు, ఏఎస్ఐలు సిబ్బంది పాల్గొన్నారు.

ఉత్సాహంగా టీడీపీ సభ్యత్వ నమోదు



జైభారత్ కాలనీలో టీడీపీ సభ్యత్వ నమోదు చేస్తున్న టీడీపీ నాయకులు

తాడికొండ, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమం ఉత్సాహంగా కొనసాగుతుంది. ఆదివారం తాడికొండలో జైభారత్ కాలనీలో టీడీపీ నాయకులు సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా టీడీపీ రాష్ట్ర వాణిజ్య విభాగం జనరల్ సెక్రటరి బండ్ల కోటేశ్వర రావు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా టీడీపీ సభ్యత్వాన్ని యువత, మహిళలు తీసుకుంటున్నారని తెలిపారు. టీడీపీ బలోపేతానికే సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని పార్టీ చేపట్టిందన్నారు. కార్యకర్తలు, నాయకులు అందరూ ఓటు కార్డు తీసుకొని వచ్చి పార్టీ సభ్యత్వాన్ని రెన్యూవల్ చేసుకోవచ్చునని అన్నారు. అలాగే సభ్యత్వం లేని వారి కూడా ఓటు కార్డు ద్వారా పేర్లు నమోదు చేసుకోవచ్చునని తెలిపారు. పార్టీ పటిష్టతకు ప్రతిఒక్కరు కృషి చేయాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో పలువురు టీడీపీ శ్రేణులు పాల్గొన్నారు. కార్యక్రమంలో ధనేకుల హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

షూటింగ్ బాల్ జట్టులో ఎస్‌వీవీ విద్యార్థుల ఎంపిక



క్రీడాకారులను అభినందిస్తున్న పాఠశాల కమిటీ సభ్యులు, టీడీపీ నాయకులు

తాడికొండ, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): జాతీయ షూటింగ్ బాల్ జట్టులో శ్రీవెల్లంకి వెంకటప్పయ్య ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎంపికైనట్లు పాఠశాల పీఈటీ శ్రీనివాస్ తెలిపారు. ఆదివారం జాతీయ జట్టులో స్థానం సాధించిన విద్యార్థులను ఘనంగా సన్మానించి అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నవంబరు 23, 24, 25 తేదీల్లో అనంతపురం జిల్లా నారప్ప మండలంలో షూటింగ్ బాల్ రాష్ట్ర స్థాయిలో జరిగిన పోటీల్లో తాడికొండ ఎస్‌వీవీ హైస్కూల్ విద్యార్థులు పాల్గొన్నారు. ఈ పోటీల్లో అండర్-17 విన్నర్స్, అండర్-19 రన్నర్స్ సాధించారు. రాష్ట్ర జట్టులో ఉత్తమ ప్రతిభ కనబరచిన రామ్ ప్రకాష్, ఫయాజ్, వీరాంజనేయులు, అయ్యప్ప, ఏడుకొండలు ఎన్నికైనట్లు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకుడు ఎడ్డూరి హనుమంతరావు, పాఠశాల కమిటీ సభ్యులు త్రిపురనేని మల్లేశ్వరరావు, పాఠశాల పేరెంట్స్ కమిటీ చైర్మన్ రవిబాబు, ప్రధానోపాధ్యాయుడు ప్రసాద్, సీనియర్ ఉపాధ్యాయులు రమణయ్య, ఎం చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

గుడిసెల కూల్చివేతకు నిరసనగా కార్మికుల ధర్నా



ప్రదర్శన నిర్వహిస్తున్న సిమెంటు ఫ్యాక్టరీ కార్మికులు

తాడేపల్లి టౌన్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): శనివారం రాత్రి బ్రహ్మానందపురంలో అక్రమంగా సిమెంటు ఫ్యాక్టరీ కార్మికుల గుడిసెల కూల్చివేతను నిరసిస్తూ ఆదివారం స్థానిక శిబిరం నుంచి ప్రకాష్‌నగర్ సెంటర్ వరకు నేతలు, కార్మికులు ప్రదర్శన నిర్వహించారు ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి వై నేతాజీ మాట్లాడుతూ ఏసీసీ సిమెంటు ఫ్యాక్టరీ కార్మికుల న్యాయమైన కోర్కె లకు మద్దతు పలకాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఈమని దుర్గారావు, బూరగ వెంకటేశ్వరరావు, ప్రకాష్, ఆశీర్వాదం, వెంకయ్య, సాంబశివరావు, యెహోషువ, రమాదేవి, శారద, ఇమాంబి, దుర్గాంబ తదితరులు పాల్గొన్నారు.

మండల, డివిజన్ స్థాయిలో పీజీఆర్ఎస్ అమలు

గుంటూరు(తూర్పు), డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ (పీజీఆర్ఎస్) అర్జీల స్వీకరణ కార్యక్రమాన్ని జిల్లా కేంద్రంతో పాటు మండల, డివిజనల్, మున్సిపల్ స్థాయిలో నిర్వహిస్తున్నట్టు కలెక్టర్ నాగలక్ష్మి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్జీదారులు ఈ విషయాన్ని గమనించి తమ ఫిర్యాదులను సమీపంలోని కార్యాలయాల్లో అందజేయాలని సూచించారు.

రచయిత ఆళ్లకు సత్కారం

తెనాలి అర్బన్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): తెనాలికి చెందిన రచయిత ఆళ్ల నాగేశ్వరరావును తెలుగు పోయెట్రీ ఫెస్టివల్ సత్కారం అందుకున్నారు. విజయవాడ బుక్ ఫెస్టివల్ ప్రాంగణంలో అమరావతి ఆర్ట్ ఫౌండేషన్ ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో కవి సమ్మేళనంలో పాల్గొన్నారు. రేపటి వృద్ధులు వచన కవితకు ఆయనను సత్కరించి జ్ఞాపిక, ప్రశంసాపత్రం ఫౌండేషన్ అధ్యక్షురాలు విజయలక్ష్మి అందజేశారు.

సమగ్ర కులగణన కోరుతూ డిసెంబరు 5న చలో ఢిల్లీ: కేసన

తెనాలి అర్బన్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): జనగణనతో పాటు సమగ్ర కులగణన కోరుతూ డిసెంబరు 5న చేపట్టిన చలో ఢిల్లీని జయప్రదం చేయాలని రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు కేసన శంకర రావు కోరారు. సంఘ నాయకులతో కలిసి ఆదివారం గుంటూరు జిల్లా తెనాలిలో విలేకరులతో మాట్లాడుతూ, పేదరిక నిర్మూలనకు, సామాజిక న్యాయ సాధనకు సమగ్ర కులగణన దోహదపడుతుందని చెప్పారు. దేశంలో అన్ని రాజకీయ పార్టీలు ఇందుకు సుముఖంగా ఉన్నప్పటికీ కేంద్రంలోని బీజేపీ పెద్దలు మాత్రం జాతీయ సమగ్రత దెబ్బతింటుందని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. దేశంలో వెనుకబడిన తరగతి వారు ఎంతో మంది దుర్భర జీవితం గడుపుతున్నారని వారికి తగిన సంక్షేమం అందించాలంటే కులగణన తప్పదన్నారు. ఏ రంగంలో ఎవరు వెనుకబడి ఉన్నారో గుర్తించి తగిన ప్రణాళికలను రూపొందించేందుకు దోహదపడే కులగణనను జనగణనతో పాటే నిర్వహించాలని కేసన డిమాండ్ చేశారు. బీసీల స్థితిగతులు ఎలా ఉన్నాయో తెలిపే పరిస్థితులు ఏ రాష్ట్రంలో కూడా లేవని, తెలంగాణ ఒక అడుగు ముందుకువేసి కులగణన చేపట్టిందని, కేంద్రం కూడా దేశవ్యాప్తంగా కులగణన నిర్వహించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఛలో ఢిల్లీ కార్యక్రమానికి రాష్ట్రం నుంచి పెద్ద సంఖ్యలో బీసీలు రావాలని కోరారు. సమావేశంలో జొన్నాదుల వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

గోవింద నామ సంకీర్తన శిక్షణ తరగతులు

తెనాలి అర్బన్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): స్థానిక గీతా మందిరంలో ఆదివారం గోవిందనామ సంకీర్తన శిక్షణ తరగతులు నిర్వహించారు. పలువురు బాల బాలికలు ఉదయం నుంచి రాత్రి వరకు కీర్తనల శిక్షణ పొందారు. ఈ నెల 27న తిరుమల ఆస్థాన మండపంలో శిక్షణ పొందిన బాలబాలికలతో సంకీర్తన గానం ఏర్పాటు చేశామని నిర్వాహకులు తెలిపారు. కొండపి వసుంధర, లక్ష్మీసునీత, వంశీకృష్ణ, కొండపి శ్రీనివాసరావు, బాల చంద్రమౌళి పర్యవేక్షించారు.

నారాకోడూరు సర్పంచ్ వీర రాఘవమ్మ మృతి



వీరరాఘవమ్మ (ఫైల్ ఫొటో)

చేబ్రోలు, డిసెంబరు 1: (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని నారాకోడూరు గ్రామ సర్పంచ్ తోట వీర రాఘవమ్మ (60) ఆదివారం మృతి చెందారు. వీరరాఘవమ్మ 2020లో జరిగిన పంచాయతీ ఎన్నికలో తెలుగు దేశం పార్టీ అభ్యర్థిగా ఘన విజయం సాధించారు. మూడు రోజులుగా అనారోగ్యానికి గురై ఆమె గుంటూరులోని ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందారు. వీరరాఘవమ్మ మృతి వార్త తెలుసుకున్న ఎమ్మెల్యే, సంగం డెయిరీ చైర్మన్ ధూళిపాళ్ల నరేంద్ర కుమార్ సర్పంచ్ కుటుంబ సభ్యులను ఫోన్‌లో పరామర్శించారు. వీరరాఘవమ్మ మృతికి సంతాపం తెలియజేశారు. అలాగే మండలంలోని పలు గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, మండల పరిషత్ అధికారులు తెలుగుదేశం, జనసేన నాయకులు వీరరాఘవమ్మ మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు.

25వ వార్డులో అన్నదానం

తెనాలి అర్బన్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని 25వ వార్డులో ఆదివారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. అంకమ్మతల్లి ఆలయంలో కార్తీకమాసం ముగింపు పూజలు జరిపారు. గత 20 ఏళ్లుగా కార్తీకమాస పూజలు జరిపి అన్నదానం చేస్తున్నామని కమిటీ ప్రతినిధి పోతురాజు తెలిపారు. శ్రీనివాసరావు, నాగేశ్వరరావు, బోసు, వెంకటేశ్వర్లు, శివ, శ్రీహరి పర్యవేక్షించారు.

కృష్ణ బలిజ సంఘం కార్తీక వన సమారాధన

తెనాలి అర్బన్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): కృష్ణబలిజ సంఘం సంఘం ఆధ్వర్యంలో ఆదివారం కార్తీక వన సమారాధన నిర్వహించారు. జగ్గడిగుంటపాలెం ఐటీఐ ప్రాంగణంలో నిర్వహించిన కార్యక్రమంలో మాజీమంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ, సంఘం నేతలు ఐక్యంగా సంఘ అభివృద్ధికి కృషి చేయడం అభినందనీయమన్నారు. బీసీల అభివృద్ధి టీడీపీ ప్రభుత్వంలోనే జరుగుతుందని, ఇందుకు నిదర్శనంగా పలు కార్పొరేషన్లు ఏర్పాటుచేసి నిధులు కేటాయించే పనిలో ప్రభుత్వం ఉందన్నారు. న్యాయవాది తాడిబోయిన శ్రీనివాసరావు, కౌన్సిలర్ అన్నం పిన్నారావు, సంఘ రాష్ట్ర అధ్యక్షుడు అశోక్‌కుమార్, మహ్మద్ ఖుద్దూస్, కావేటి వేణుగోపాలరావు, కావేటి సామ్రాజ్యం తదితరులు పాల్గొన్నారు.

హైందవ శంఖారావం సభపై ప్రజలను చైతన్యవంతులను చేయండి

● హనుమంతరావు

తెనాలి రూరల్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): జనవరి 5 విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో విజయవాడలో నిర్వహించనున్న హైందవ శంఖారావం సభపై ప్రజలను చైతన్యవంతులను చేయాలని తెనాలి సరస్వతి శిశుమందిర్ అధ్యక్షుడు యర్రంశెట్టి హనుమంతరావు అన్నారు. ఆదివారం మండలంలోని నందివెలుగు కనకదుర్గమ్మ అమ్మవారి ఆలయంలోని కల్యాణ మండపంలో పరిషత్ సభ్యులతో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో సభ్యులు పోతూరి నాగేంద్రం, కూటమి నాయకులు కోటేశ్వరరావు, శేషగిరి, శ్రీనాథ్ తదితరులు పాల్గొన్నారు.

రైతులకు కంటిమీద కునుకు కరువు

● ఎడతెరిపి లేని మబ్బుల్లో వర్షం

● చెదురు మదురుగా కురుస్తున్న వర్షం

● వర్షానికి నేలవాలిన వరి పైరు

● ధాన్యాన్ని కాపాడుకోవటానికి రైతుల ఇక్కట్లు





కొల్లిపర మండలం సిరిపురంలో వర్షానికి పడిపోయిన వరిపైరు, కొల్లిపర మండలం అత్తోటలో వర్షానికి తడిచిన ఓదెలను అరబెడుతున్న రైతులు





కొల్లిపరలో ధాన్యాన్ని గోతాలకు ఎత్తుతున్న కూలీలు, కొల్లిపర మండలం తూములూరు సమీపంలో మినుము పంటను నూర్పిడి చేస్తున్న యంత్రం

కొల్లిపర, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఫెంగల్ తుఫాన్ ప్రభావంతో గత మూడు రోజులుగా వాతావరణంలో మార్పు రావటంతో పాటు అడపా, దడపా చిరుజల్లులతో పాటు వర్షం పడటంతో రైతులు విలవిల్లాడుతున్నారు. పంట చేతికి వచ్చే సమయంలో కురుస్తున్న వర్షాలకు రైతులను కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నాయి. అష్టకష్టాలు పడి సేద్యంచేసి పండించిన వరిపంట కురుస్తున్న వర్షాలకు ఎక్కడ దెబ్బతింటుందేమోనని అన్నదాతలు ఆందోళనకు గురవుతున్నారు. ఈదురు గాలులతో వర్షం పడటంతో కొల్లిపర మండలంలో పలుచోట్ల వరి పంట చెల్లాచెదురై నేలవాలింది. దీంతో వరి పంట పూర్తిగా దెబ్బతింటుందేమోనని రైతులు మనోవేదనకు గురవుతున్నారు. మండలంలో చివలూరు, సిరిపురం, అత్తోట, అత్తోటయాదవపాలెం, కొల్లిపర, దంతలూరు, కుంచవరం తదితర గ్రామాల్లో వరి పంట 90శాతం వరి కోతకు వచ్చింది. యంత్రాల ద్వారా రైతులు వరి నూర్పిళ్లు ముమ్మరంగా ప్రారంభించే సమయంలో చెదురుమదురుగా చిరుజల్లులు పడటంతో రైతులు దిక్కుతోచని స్థితిలోపడ్డారు. వరికోతలు కోసి ఓదెలపై ఉండటంతో ప్రకృతి కన్నెర్రచేసి, ఏ సమయంలో ఎలాంటి ప్రమాదం సంభవిస్తుందోనని కొంతమంది రైతులు ఎండకుండానే కూలీలతో కట్టలు కట్టించి కుప్పలు వేయిస్తున్నారు. మరికొంతమంది రైతులు తీరా నోటి దగ్గరకు వచ్చే సమయానికి ఏమి అనర్థం జరుగుతుందోనని భయపడి వరిని యంత్రాల ద్వారా హడావుడిగా నూర్పిళ్ళు చేయించి ధాన్యాన్ని ట్రాక్టర్ల ద్వారా తమ గృహాలకు తరలించారు. మరికొంతమంది రైతులు యంత్రాలతో నూర్పిడిచేసిన ధాన్యాన్ని రోడ్లపై ఆరబెట్టి వర్షాలకు తడవకుండా పట్టాలు కప్పి రక్షించుకున్నారు. పొలాల్లో, డొంకరోడ్లపై ఆరబోసిన ధాన్యాన్ని హడావిడిగా కూలీలతో గోతాలకు ఎక్కించి ట్రాక్టర్ల ద్వారా గ్రామాలకు తరలించారు. అదేవిధంగా మండలంలో మెట్ట భూముల్లో వేసిన మినుము పంట కోత కోసి నేలపై ఉండటంతో రైతులు హడావిడిగా కూలీలలతో గుట్టవేయించి పట్టాలు కప్పి రక్షించుకున్నారు. కొంతమంది రైతులు మినుము పంట వర్షానికి ఎక్కడ దెబ్బతింటుందేమోనని భయపడి యంత్రాల ద్వారా నూర్పిడి చేయించి మినుములను గృహాలకు తరలించారు.

ఆందోళనలో అన్నదాతలు

తెనాలి అర్బన్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): తెనాలి డివిజన్‌లో మొదలైన చిరుజల్లులతో వరి పైరు వాలిపోతోంది. నిన్న మొన్నటి వరకు బాగున్న వాతావరణం ఒక్కసారిగా మారిపోయి జల్లులు పడుతుండటంతో దాని ప్రభావం ఖరీఫ్ పంటపై పడుతుంది. తెనాలి డివిజన్‌లోని అన్ని గ్రామాల్లో వరిపైరు చేతికంది వచ్చే దశలో తుఫాన్ ఏర్పడటం, దాని కారణంగా జల్లులు కురవడం వల్ల పంట దెబ్బతింటుందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఆదివారం ఉదయం, మధ్యాహ్నం, రాత్రి పడిన చిరుజల్లుల ప్రభావం అధికంగా పంటపై పడింది. గత ఏడాది కూడా ఓదెలపై వర్షం కురిసి రైతులు నష్టపోయారు. ఈ ఏడాది అదే పరిస్థితి నెలకొనడంతో పెట్టుబడి ఖర్చుల అయిన దక్కుతాయో లేదోనని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వరి పైరుకు ఎకరాకు రూ.25 వేలు వరకు చేసిన వ్యయం కళ్లముందే కనబడుతూ ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసినా వాతావరణ పరిస్థితులతో బయట దళారులకు బస్తా ధర రూ.1300-1400 వరకు విక్రయించుకుంటున్నట్లు రైతులు వాపోతున్నారు. ప్రభుత్వం రూ.1700 పైగా ఇస్తున్నప్పటికీ ధాన్యాన్ని ఆరబెట్టి భద్రపరిచే పరిస్థితులు లేకపోవడంతో మరికొంత నష్టపోవాల్సి వస్తుందని చెబుతున్నారు. వరుసగా రెండో సంవత్సరం కూడా పంట వర్షాలకు తడిసినా ధాన్యాన్ని ప్రభుత్వ ధరకే కొనుగోలు చేసి ఆదుకోవాలని కోరుతున్నారు.

బాలికతో అసభ్యంగా ప్రవర్తించిన మేనమామపై కేసు

తెనాలి రూరల్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): బాలికతో అసభ్యంగా ప్రవర్తించిన మేనమామపై కేసు నమోదు చేసినట్లు రూరల్ పోలీసులు తెలిపారు. మండలంలోని కొలకలూరులో నివాసముంటున్న ఓ కుటుంబానికి చెందిన బాలికను వరుసకు మేనమామ అయ్యే వ్యక్తి తరుచూ అసభ్యంగా ప్రవర్తిస్తుండటంతో బాలిక కుటుంబ సభ్యులు రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.



యజ్ఞ పూజలను నిర్వహిస్తున్న భక్తులు

శ్రీవిద్యాపీఠంలో సర్వశ్రేయస్కరి మహాయజ్ఞం

తెనాలి, మారీసుపేట, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): శ్రీవిద్యాపీఠంలో సర్వశ్రేయస్కరి మహాయజ్ఞాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. స్థానిక గంగానమ్మపేటలోని శ్రీవిద్యాపీఠంలో ఆదివారం శ్రీసాలిగ్రామ మఠం ట్రస్ట్ ఆధ్వర్యంలో పూజ్యశ్రీ బాలస్వామి స్వయం పర్యవేక్షణలో సర్వశ్రేయస్కరి మహాయజ్ఞాన్ని వైభవంగా నిర్వహించారు. ఉదయం శ్రీగణపతి పూజ, దోష నివారణాభిషేకాలు, శ్రీచక్రానికి పంచామృతాలతో 200మంది భక్తులతో చేయించారు. ఈ సందర్భంగా బాలస్వామి ప్రవచనమిచ్చారు. కార్తీక మాసంలో ఆదివారం అమావాస్య, అనూరాధ నక్షత్రం 450 సంవత్సరాలకు ఒకసారి కలసి రావడం విశేషమని అందుకే సర్వశ్రేయస్కరి మహాయజ్ఞం నిర్వహించామన్నారు. యజ్ఞ విశిష్టతను భక్తులకు వివరించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదలు పంపిణీ చేసి అన్నప్రసాద వితరణ చేశారు. కార్యక్రమంలో ట్రస్ట్ చైర్మన్ నంబూరి వెంకట కృష్ణమూర్తి, గౌరవాధ్యక్షుడు కొత్త సుబ్రహ్మణ్యం, సంస్కృతి విభాగ చైర్మన్ గడ్డిపాటి శ్రీనివాసరావు, రావూరి సుబ్బారావు, ముద్దాభక్తుని రమణయ్య, గోపు రామకృష్ణ, పెనుగొండ వెంకటేశ్వరావు, రాజేశ్వరావు, శివప్రసాద్, మురళీ మనోహర్, లోకనాధం పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

తెనాలి అర్బన్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఐదు దశాబ్దాల తరువాత పూర్వవిద్యార్థులు కలుసుకున్నారు. 1972-74లో వీఎస్ఆర్ అండ్ ఎన్‌వీఆర్ కళాశాలలో ఇంటర్ చదివిన విద్యార్థులు ఆదివారం గౌతమ్ గ్రాండ్‌లో సమావేశమయ్యారు. వివిధ రంగాల్లో స్థిరపడిన వారు కలుసుకుని స్వర్ణోత్సవ వేడుకలు జరుపుకున్నారు. ఆనాటి మధుర జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. ఇతర దేశాల నుంచి కూడా వచ్చిన విద్యార్థులతో సందడిగా గడిపారు. అధ్యాపకులుగా పదవీ విరమణ చేసిన శైలజ, పద్మజ, రామమోహనరావు సమావేశానికి కృషిచేశారు. విశ్రాంత ప్రిన్సిపాల్స్ నన్నపనేని ముకుందరావు, శాంతాదేవి, రమణ, రాజేశ్వరి తమ గురువులైన అధ్యాపకులు వెంకట్రావు, మల్లికార్జునరావు, పాపారావు, లక్ష్మి, సాంబశివరావు, సుగుణ, రాజ్యలక్ష్మిలను సన్మానించారు. ఎన్నారై డాక్టర్ పి.అజయ్‌కుమార్, సిండికేట్ బ్యాంకు విశ్రాంత ఏజీఎం ఆంజనేయులు, ఆంధ్రా బ్యాంకు ఏజీఎం రామమోహనరావు, ప్రొఫెసర్ సత్యమోహన్, న్యాయవాదులు, పారిశ్రామికవేత్తలు, వివేకా డైరెక్టర్ రావిపాటి వీరనారాయణ తదితరులు పాల్గొన్నారు.



సమావేశమైన వీఎస్ఆర్ అండ్ ఎన్‌వీఆర్ కళాశాల పూర్వ విద్యార్థులు

44ఏళ్ల తరువాత కలుసుకున్న పూర్వవిద్యార్థులు

తెనాలి రూరల్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): చిన్నతనంలో కలిసి చదువుకుని వివిధ హోదాల్లో స్థిరపడి 44ఏళ్ల తరువాత ఆత్మీయ సమావేశంలో కలుసుకున్నారు. మండలంలోని సంగంజాగర్లమూడి కొత్త వెంకయ్య చౌదరి మెమోరియల్ జిల్లా పరిషత్ హైస్కూల్‌లో 1979-80 పూర్వవిద్యార్థులు ఆత్మీయ అనురాగ సమ్మేళనం ఆదివారం సందడిగా జరిగింది. యోగక్షేమాలు తెలుసుకుని చిన్నతనంలో చేసిన అల్లర్లను తలచుకుని ఆనాటి జ్ఞాపకాలను నెమరవేసుకున్నారు. తొలుత స్కూల్ నిర్మాణానికి స్థలాన్ని అందించిన దాత కొత్త వెంకయ్య చౌదరి విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. స్కూల్ హెచ్ఎం, ఇతర ఉపాధ్యాయులను సత్కరించారు. కార్యక్రమంలో పలువురు పూర్వవిద్యార్థులు పాల్గొన్నారు.



ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు



కవి సత్కారం అందుకుంటున్న షేక్ రహీమ్ సాహెబ్

షేక్ రహీమ్ సాహెబ్‌కు కవి సత్కారం

పొన్నూరు టౌన్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): పొన్నూరుకు చెందిన కవి, గాయకుడు, ఆర్టీసీ కండక్టర్ షేక్ రహీమ్ సాహెబ్‌కు కవి సత్కారం లభించింది. విజయవాడ బుక్ ఫెస్టివల్ ప్రాంగణంలో ఆదివారం జరిగిన తెలుగు పొయెట్రీ ఫెస్టివల్‌లో భాగంగా అమరావతి ఆర్ట్ ఫౌండేషన్ శత కవుల సమ్మేళనం నిర్వహించింది. తెలుగును బతికించు అనే కవితాగానం చేసిన షేక్ రహీమ్ సాహెబ్‌కు కవి సత్కారం చేశారు. ఫౌండేషన్ అధ్యక్షుడు డాక్టర్ పోట్లూరి హరికృష్ణ, గోళ్ల నారాయణ, డి.సుభాని తదితరులు సత్కరించారు.

గాంధీనగర్‌లో వైద్య శిబిరం



రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

తెనాలి అర్బన్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని గాంధీనగర్‌లో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. మైత్రి హాస్పటల్ వైద్యులు పావని ప్రియాంక, మహేష్‌కిరణ్, ఈదర సుప్రియ చౌదరి, నారాయణ స్వామి, మంజులవాణి రోగులను పరీక్షించారు. మందులు ఉచితంగా పంపిణీ చేశారు. షుగర్, బీపీ, ఈసీజీ పరీక్షలు చేసి తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. కార్యక్రమాన్ని ఉదయభాస్కర్, రమణమ్మ తదితరులు పర్యవేక్షించారు.



దోమ తెరలు అందజేస్తున్న దిలీప్‌రాజా

పేదలకు దోమ తెరలు పంపిణీ

తెనాలి అర్బన్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఫుట్‌పాత్‌లపై జీవనం సాగిస్తున్న పేదలకు ఆదివారం సినీ దర్శకుడు దిలీప్‌రాజా దోమ తెరలు పంపిణీ చేశారు. మార్కెట్ వంతెన, కాల్వ కట్టలపై, యాచకులు, అనాధలు, వృద్ధులకు వీటిని అందజేశారు. శ్రీకాంత్, రత్నాకర్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.



డాక్టర్ హరిప్రసాదరావు చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే డాక్టర్ ఉమ, ఐఎంఏ అధ్యక్షుడు అనిల్ కుమార్, లక్ష్మీప్రసాద్ తదితరులు

ఆదర్శనీయుడు డాక్టర్ హరిప్రసాదరావు

● మాజీ ఎమ్మెల్యే డాక్టర్ ఉమ

తెనాలి, మారీసుపేట, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): పేద ప్రజలకు డాక్టర్ గోగినేని హరిప్రసాదరావు అందించిన వైద్య సేవలు ఆదర్శనీయమని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోగినేని ఉమ అన్నారు. స్థానిక బోసురోడ్డు ఐఎంఏ తెనాలి శాఖ కార్యాలయంలోని శ్రీమతి శ్యామల రత్నమ్మ అండ్ మేజర్ కాకుమాను వుళక్కి మెమోరియల్ హాల్‌లో ఆదివారం డాక్టర్ గోగినేని హరిప్రసాదరావు జయంతి వేడుకలను ఐఎంఏ తెనాలి శాఖ సభ్యులు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఐఎంఏ తెనాలి శాఖ అధ్యక్షుడు డాక్టర్ కె అనిల్‌కుమార్ ఆధ్వర్యంలో డాక్టర్ గోగినేని ఉమ, డాక్టర్ గోగినేని లక్ష్మీప్రసాద్ దంపతులు ముఖ్య అతిథిలు పాల్గొన్నారు. ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భగా ఆమె మాట్లాడుతూ ఆయన కంటి వైద్య నిపుణులుగా పేదప్రజలకు రూ.1కే వైద్య సేవలు అందించిన మహోన్నత వ్యక్తి అన్నారు. రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించడానికి కృషి చేసేవారని కొనియాడారు. వారుచూపిన బాటలో ప్రతిఒక్కరూ ముందుకు సాగాలన్నారు. కార్యక్రమంలో అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ కె.అనిల్ కుమార్, జి మధు ప్రభాకర్‌బాబు, సభ్యులు డాక్టర్‌లు పావని ప్రియాంక, వేమూరి శేషగిరిరావు, జి నరసింహారావు, ఉమామహేశ్వరావు, చక్రవర్తి, లోకేశ్వరప్రసాద్, జి.గిరిజ, ఎంవీ సత్యనారాయణ, శ్యామ్‌ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



మానవహారంగా ఏర్పడిన విద్యార్థులు

ఎయిడ్స్ నిర్మూలనకు అవగాహన అవసరం

తెనాలి అర్బన్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఎయిడ్స్ వ్యాధి నిర్మూలించేందుకు ప్రతి ఒక్కరిలో అవగాహన అవసరమని జేఎంజే కళాశాల ప్రిన్సిపాల్ షైనీ పేర్కొన్నారు. ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం పురస్కరించుకుని ఆదివారం కళాశాలలో సమావేశం నిర్వహించారు. అనంతరం విద్యార్థులతో ర్యాలీ, మానవహారం కార్యక్రమాలు జరిపారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ, ఎయిడ్స్‌పై ఉన్న అపోహలు తొలగించుకోవాలని చెప్పారు. ఎయిడ్స్ వ్యాప్తి, నిరోధం, జాగ్రత్తలు వంటి పలు అంశాలను వివరించారు. అరుణసుజాత, అమూల్‌మేరి, శారద, నిర్మలజ్యోతి, పాటిబండ్ల హేమలత తదితరులు పాల్గొన్నారు.



ప్రదర్శన నిర్వహిస్తున్న భవన నిర్మాణ రంగ కార్మికులు

9న జరిగే ధర్నాను జయప్రదం చేయాలి

● సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి దండా లక్ష్మీనారాయణ

చేబ్రోలు, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): భవన నిర్మాణ రంగ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిసెంబరు 9వ తేదీన కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా జరిపే ధర్నాను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి దండా లక్ష్మీనారాయణ పిలుపునిచ్చారు. మండల పరిధిలోని వడ్లమూడిలో ఆదివారం భవన నిర్మాణరంగ కార్మికుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా పాల్గొన్న లక్ష్మీనారాయణ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఆరు నెలలు గడుస్తున్నప్పటికీ భవన నిర్మాణ సంక్షేమ బోర్డును పునరుద్ధరించకపోవటం కార్మికులపై అశ్రద్ధ వైఖరి తెలియజేస్తుందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి లోకేశ్ సంక్షేమ బోర్డును పునరుద్ధరిస్తామని ఎన్నికల సందర్భంగా వాగ్దానం చేశారని గుర్తుచేశారు. హామీలు అమలు కోరుతూ ధర్నా నిర్వహిస్తునట్లు చెప్పారు. కార్మికుల పెండింగ్ క్లయిమ్‌లు పరిష్కరించాలని, రాజధాని నిర్మాణంలో స్థానిక కార్మికులకు అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో స్థానిక కమిటీ నాయకులు ఎస్‌కె బాజీ, ఖాజా మొహిద్దీన్, షేక్ షమీవుల్లా, ఎస్‌డీ సుభాని, షేక్ సిలర్హా, షేక్ ఖాదర్, ఇస్మాయిల్ తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు వంటల పోటీలు

తెనాలి అర్బన్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని గ్యాస్ ఏజెన్సీల ఆధ్వర్యంలో ఆదివారం మహిళలకు వంటల పోటీలు నిర్వహించారు. గాంధీచౌక్‌లోని ప్రిన్స్ హోటల్‌లో మన వంటగది - మన బాధ్యత పేరిట నిర్వహించిన పోటీలలో పలువురు మహిళలు పాల్గొన్నారు. నోరూరించే వివిధ రకాల వంటలను తయారు చేశారు. నగరాజకుమారి, ఉషారాణి, శ్యామల, విజయలక్ష్మి, అనూరాధ, అమూల్య బహుమతులు అందుకున్నారు. న్యాయ నిర్ణేతలుగా డాక్టర్ జీవనలత, కొడాలి సౌజన్య వాసిరెడ్డి ప్రియబాంధవి వ్యవహరించారు. గ్యాస్ డీలర్లు రమణ, మురళీకృష్ణ పర్యవేక్షించారు.